# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

30.11.2025
ఆదివారం Sunday

సంపుటి (volume): 1
సంచిక (Issue): 155

పేజీలు : 8
Pages : 8

వెల రూ. 2.00

Published from : Hyderabad
Circulated to : Telangana









## శ్రీలంకలో ద్వితా బీభత్సం

- వరదలకు ఇప్పటికే 123మంది మృతి
- మరికొందరి ఆచూకీ గల్లంతు
- దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటన

04

## 1 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

04





## మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేం

దేశంలో ఏ ఉత్సవాలకు
ఆ హోదా లేదు
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

02



# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

### స్టోరేజీకి అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్, నవంబరు 29:** తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్‌తో తెలంగాణ ముందుకు పోతుందని భట్టి వెల్లడించారు. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తీర్చి దిద్దుతున్నామని, హైదరాబాద్ గ్లోబల్ హబ్ కాబోతోందని భట్టి తెలిపారు. 2047 వరకు మూడు ట్రిలియన్‌ల ఎకానమీకి చేరుకోవాలనేది లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు కావలసిన పెట్టుబడులకు అవసరమైనది విద్యుత్ అన్నారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ప్లానింగ్ చేస్తున్నాం.. పవర్ డిమాండ్ రాష్ట్రంలో పదేళ్లుగా పెరుగుతుందని తెలిపారు.

మిగతా 2 లో

గ్రీన్ ఎనర్జీ.. దేశ, ఆయా రాష్ట్రాల అభివృద్ధికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ అనే చర్చ జరుగుతుందని అన్నారు. పారిస్‌లో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం తప్పకుండా గ్రీన్ ఎనర్జీ ఉండాలని అగ్రిమెంట్ చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంలో గుర్తు చేశారు.





## డాక్టర్‌ను ట్రాప్ చేసి 14 కోట్లు కొట్టేశారు!

- కొంపముంచిన ఫేస్‌బుక్‌పరిచయం
- ఆమె సూచనతో పెట్టుబడి పెట్టి దివాళా
- చైనీస్‌సైబర్ ఫ్రాడ్‌గ్యాంగ్‌గా గుర్తింపు
- 1.80 కోట్లు ఫ్రీజ్.. మిగతాది విదేశాలకు..

ఫేస్‌బుక్‌లో హాయ్ చెప్పి.. ఓ డాక్టర్‌ని మోసం చేసిందో లేడి. పెట్టుబడి పెడితే డబ్బులు డబుల్ అవుతాయని చెప్పి.. కోట్లు కొట్టేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రైవేటు హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నాడు.

02

## దంపతులను బురిడీ కొట్టించి 3.5 కోట్లు దోపిడీ

- ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు
- క్షుద్రపూజలతో భయపెట్టాడు, మాయమాటలు చెప్పాడు
- అందినకాడికి దోచుకుని బెదిరింపులు

02



## పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు దారుణం

- వెంటనే క్షమాపణలు చెప్పాలి: ఎమ్మెల్యే అనిరుధ్

02

కోనసీమపై తెలంగాణ నాయకుల దిష్టి పడిందని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అనడం తప్ప మాత్రమే కాదు, దారుణమని మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వ్యాఖ్యానించారు.



## సీఎం రేవంత్‌తో శుభలేఖ సుధాకర్‌భేటీ

### రవీంద్రభారతిలో ఎస్పీబీ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

**హైదరాబాద్, నవంబర్29:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీనటుడు, శుభలేఖ సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 15న రవీంద్ర భారతి ఆవరణలో దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. రవీంద్ర భారతి ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు ఎస్పీ బాలు కుటుంబం తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఐ అంటే ఇంటర్నెట్

- ఐబొమ్మ రవి నుంచి కీలక సమాచారం సేకరణ
- మూడు రోజుల కస్టడీ అనంతరం చంచల్‌గూడకు తరలింపు

02

ఐబొమ్మ పూర్తిపేరు 'ఇంటర్నెట్ బొమ్మ' అని ఈ కేసులో అరెస్టయిన ఇమంది రవి వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని అనుకున్నట్లు తెలిపాడు.




## సర్పంచ్ ఎన్నిక కోసం ఎస్ఐ రాజీనామా

స్వచ్ఛంద పదవి విరమణ

02

## రాజకీయ కోలాహలం

ముగిసిన తొలిదశ నామినేషన్ల గడువు




02

## ఆ స్లీపర్ బస్సులను తక్షణం పక్కన పెట్టేయండి

రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశం



04

# కేసీఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు

- కొందరు మూర్ఖులు కనిపించడం లేదంటున్నారు
- కేసీఆర్‌ది దొంగదీక్ష అన్న వారికి ఉద్యమం ఏంతెలుసు
- కాంగ్రెస్ నేతలపై మండిపడ్డ బీఆర్ఎస్ నేత కేటీఆర్

03





## భూములు అమ్ముకునే కుట్ర

- గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం
- సీఎం రేవంత్‌పై సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ ఆరోపణలు

03



# మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేం..

**దేశంలో ఏ ఉత్సవాలకు ఆ హోదా లేదు ■ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**వరంగల్, నవంబర్29:** మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించలేమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌నుంచి వందే భారత్‌రైలులో వరంగల్‌కు కిషన్‌రెడ్డి చేరుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సెంట్రల్ ఆర్కాలజీ అధికారులతో కలిసి వెయ్యి స్థంబాల ఆలయాన్ని ఆయన సందర్శించారు. అభివృద్ధి పనులు ఆలస్యంపై అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించి ఘనంగా నిర్వహిస్తోంది. అయితే జాతీయ పండుగగా ప్రకటించాలని ఏళ్లుగా డిమాండ్ ఉంది. దీనిపై తాజాగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశంలో ఏ జాతరకు జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. దేశంలో ఏ ఉత్సవాలకు జాతీయ హోదా లేదని తెలిపారు. మేడారానికి కూడా ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. వరంగల్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హెరిటేజ్ సిటీ, స్మార్ట్ సిటీకి నిధులు ఇచ్చామన్నారు. వెయ్యి స్తంభాల ఆలయంలో మండపం పునర్నిర్మాణం చేశామని చెప్పారు. భద్రాచలం రూ. 50 కోట్లు, రామప్పను రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రసాద్ స్కీమ్‌లో రామప్ప, భద్రాచలం, జోగులాంబ ఆలయాన్ని డెవలప్‌మెంట్ చేస్తున్నామని తెలిపారు. మేడారం జాతర విషయాన్ని కేంద్ర ట్రైబల్, టూరిజం మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు దారుణం

**వెంటనే క్షమాపణలు చెప్పాలి: ఎమ్మెల్యే అనిరుధ్**



**హైదరాబాద్, నవంబరు 29:** కోనసీమపై తెలంగాణ నాయకుల దిష్టి పడిందని ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అనడం తప్పు మాత్రమే కాదు, దారుణమని మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఎప్పుడూ మేము ఆంధ్రప్రదేశ్ సంక్షేమానికే మద్దతు ఇచ్చామని, రెండు రాష్ట్రాలు సౌహార్దంతో అభివృద్ధి చెందాలని కోరుకుంటామన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర విభజన అడ్డుపడిందంటే మాత్రం ఊరుకోమన్నారు. పవన్ కళ్యాణ్ వెంటనే భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల గురించి, తెలంగాణ ప్రాంతం గురించి తప్పుగా మాట్లాడితే సహించబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో ఆంధ్ర కాంట్రాక్టర్లు కోట్లు రూపాయల స్కామ్ చేసిన సందర్భాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో వారి భరతం పడతామని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి హెచ్చరించారు. పవన్ కళ్యాణ్‌కు తెలంగాణలో అభిమానులు ఉన్నారని, ఆయన సినిమాలను తెలంగాణ ప్రజలు ఎప్పుడూ బహిష్కరించ లేదని గుర్తుచేశారు. ప్రజల మధ్య విభేదాలు రేకెత్తించే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.


# ఐ అంటే ఇంటర్నెట్

**ఐబొమ్మ రవి నుంచి కీలక సమాచారం సేకరణ**

**మూడు రోజుల కస్టడీ అనంతరం చంచల్‌గూడకు తరలింపు**

**హైదరాబాద్, నవంబరు 29:** ఐబొమ్మ పూర్తిపేరు 'ఇంటర్నెట్ బొమ్మ' అని ఈ కేసులో అరెస్టయిన ఇమంది రవి వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని అనుకున్నట్లు తెలిపాడు. డొమైన్‌లో సాంకేతిక సమస్యతో 'ఎల్' అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వెల్లడించాడు. శనివారంతో నిందితుడి రెండో విడత కస్టడీ పూర్తయ్యింది. ఇందులో భాగంగా పోలీసులు అతడిని 3 రోజులపాటు ప్రశ్నించి.. కీలక సమాచారం సేకరించారు. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి పోలీసులకు రవి వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాల్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవేనని చెప్పాడు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. ఈ క్రమంలో అతను పోలీసుల ముందు సంచలన విషయాలు వెల్లడించాడు. రవి మెయిల్ అకౌంట్స్ రిట్రైవ్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు.. ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్స్‌లో 21వేలకు పైగా సినిమాలను గుర్తించారు. పైరసీ వెబ్‌సైట్స్ నుంచి సినిమాలు రికార్డింగ్ చేసినట్టు గుర్తించారు. ఓటీటీలో వచ్చే సినిమాలను కూడా రికార్డింగ్ చేసినట్టు రవి అంగీకరించినట్లు తెలిసింది. రికార్డింగ్ చేసిన ఆడియోలు, వీడియోల క్వాలిటీ పెంచేందుకు.. కరేబియన్ దీవుల్లో ఔట్‌సోర్సింగ్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి రవి పోలీసులకు వివరించాడు. తాను నిర్వహించిన వెబ్‌సైట్లపై కూడా క్లారిటీ ఇచ్చాడు. ఐబొమ్మ పూర్తిపేరు ఇంటర్నెట్ బొమ్మగా వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని.. బొమ్మను ఇంటర్నెట్‌లో చూపిస్తున్నందుకే ఐబొమ్మ అని పేరు పెట్టినట్లు చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం పేరు పెట్టాలని భావించినట్లు తెలిపాడు. అయితే డొమైన్‌లో సాంకేతిక సమస్యతో ఒ అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవే అని రవి అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

# సర్పంచ్ ఎన్నిక కోసం ఎస్ఐ రాజీనామా



**కోదాడ, నవంబరు 29:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతుంది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కోదాడ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పులి వెంకటేశ్వర్లు తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించారు. స్వస్థలం కోదాడ మండలం గుడిబండ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆయన స్వచ్ఛంద పదవి విరమణ చేశారు. పుట్టిన ఊరికి సేవ చేయడమే లక్ష్యంగా ఇంకా 5 నెలల సర్వీస్ ఉండగానే వీఆర్ఎస్ తీసుకున్నట్లు వెల్లడించారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన గుడిబండలో మొత్తం జనాభా 4,486. ఓటర్లు 3,813. వార్డులు 12. ఆదివారం నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది.




# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

మొదటి పేజీ తరువాయి

తాజాగా ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. 2014 నుంచి విద్యుత్తు 14.2 డిమాండ్ గ్రోత్ ఉందన్నారు. 2020-2021 నుంచి 5.44 గ్రోత్, 2024-25లో 9.8శాతం గ్రోత్ కనిపించిందని వెల్లడించారు. 2025 నుంచి 34, 35 వరకు తెలంగాణలో 6.4 గ్రోత్ ఉండే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మూసి ప్రక్షాళన.. ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడుల ఒప్పందం.. పరిశ్రమలు.. డేటా సెంటర్లతో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారబోతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 8.50 గ్రోత్ ఉండబోతుంది.. 2047కి లక్ష 39వేల మెగావాట్ల విద్యుత్ అవసరం.. తెలంగాణలో 2026 ఏప్రిల్ నాటికి 24769 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంది.. వాడే విద్యుత్తులో 50 శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలి.. ఎనర్జీ స్టోరేజ్ ప్లాన్ గతంలో లేదు.. పదేళ్ల క్రితం ప్లాన్ చేసుకుని ఉంటే బాగుండేది.. అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ స్టోరేజ్ ప్లానింగ్ లేదు.. గ్రీన్ పవర్ ఎనర్జీ స్టోరేజ్‌కి తెలంగాణ అనుకూలం.. పదేళ్లుగా ఇలాంటి ప్రయత్నాలు చేయలేదు.. కానీ ఏపీ మొదలుపెట్టింది.. తెలంగాణలో మాత్రం ఆ ప్రయత్నమే లేదు.. థర్మల్ పవర్ కంటే.. గ్రీన్ ఎనర్జీ వస్తుంది.. కానీ తెలంగాణ అందుకోలేక పోయింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత.. డిలైట్ లాంటి వాళ్ళను నివేదిక ఇవ్వండి అని అడిగాం.. ఒక్కరోజు బ్లాక్ ఔట్ అయితే 1500 నుండి 2000 కోట్లు నష్టపోతం.. అని వెల్లడించారు.


# రాజకీయ కోలాహలం

**ముగిసిన తొలిదశ నామినేషన్ల గడువు**

**హైదరాబాద్, నవంబరు 29:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. రాష్ట్రంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే. శనివారంతో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. తొలి రోజే సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు సర్పంచి పదవుల కోసం 3,242 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1,821 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 4901 నామినేషన్లు దాఖలు. రెండో రోజు వార్డు మెంబర్ల స్థానాలకు 9643 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8198 నామినేషన్లు, 11502 వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలు అయినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 189 మండలాల్లోని 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనున్నది. 30వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు. డిసెంబర్ 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు చేపట్టి వార్డు సభ్యులు, సర్పంచుల ఫలితాలను వెల్లడిస్తారు.

# ఒకే కుటుంబంలో తీరని విషాదం

- అంతుచిక్కని వ్యాధితో ముగ్గురు బాలల మృతి
- ఘటనతో అప్రమత్తం అయిన అధికార యంత్రాంగం
- గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి పర్యవేక్షణ



**లక్నో, నవంబర్ 29:** ఉత్తరప్రదేశ్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. తీవ్ర జ్వరంతో బాధపడుతూ గంటల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన ఆ రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపింది. విషయం తెలిసిన వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. నెబువా నౌరంగియా బ్లాక్‌లోని గులార్హియా తోలా గ్రామంలో వరుసగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. వారి మృతికి కారణాలు తెలియరాలేదు. పింటు గౌర్ అనే వ్యక్తి కుమార్తె మంజు(7) వారం క్రితం అనారోగ్యానికి గురైంది. స్థానిక వైద్యుడి వద్ద చికిత్స అందించినప్పటికీ బాలిక కోలుకోలేదు. ఈ క్రమంలో మరో ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత కొన్ని గంటలకే గౌర్‌కు చెందిన చిన్న కుమార్తె ఖుషి (3), కుమారుడు కృష్ణ (5) కూడా జ్వరంతో మృతి చెందారు. ముగ్గురు చిన్నారుల మృతి నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వీరి మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి.. గ్రామంలోని మిగిలిన పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. దర్యాప్తు అనంతరం పిల్లల మృతికి గల కారణాలు వెలువడతాయన్నారు. ఆరోగ్యశాఖ బృందం ఇప్పటివరకు గ్రామంలో 57 మంది పిల్లలకు మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించినట్లు ఓ అధికారి తెలిపారు. అవసరమైన వారికి మందులు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి గల కారణాలను. నీటి నమూనాలను పరిశీలిస్తున్నారు. అలాగే ఆహార పదార్థాలపైనా ఆరా తీస్తున్నారు.

# దంపతులను బురిడీ కొట్టించి 3.5 కోట్లు దోపిడీ

**ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు**

**క్షుద్రపూజలతో భయపెట్టాడు,**

**అందినకాడికి దోచుకుని ఆపై బెదిరింపులు**



**వనపర్తి, నవంబర్29:** ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆరోగ్యం బాగుచేయాలని తనను ఆశ్రయించిన దంపతులను క్షుద్రపూజల పేరుతో భయపెట్టి ఏకంగా రూ.3.50 కోట్లు కొట్టేశాడో నకిలీ గురువు. ఈ ఘటన కర్నూలు జిల్లా ఆదోని మండలం బైచిగేరిలో చోటుచేసుకుంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవట్లేదని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరులో ఉంటున్న వెంకటయ్య, పద్మ దంపతులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బైచిగేరి గ్రామానికి చెందిన దుర్గాసింగ్‌కు దేవుడు వస్తాడని, అక్కడికి వెళ్తే ఆరోగ్యం కుదుట పడుతుందని ఎవరో చెబితే కొన్ని రోజుల కిందట దంపతులు అక్కడికి వెళ్లారు. దీన్ని ఆసరాగా చేసుకున్న దుర్గాసింగ్ వారికి కట్టుకథలు చెప్పారు. మీ పొలంలో నిధి ఉందని, అది తీసేంత వరకూ మీకు, మీ పిల్లలకు ప్రాణహాని ఉంటుందని భయపెట్టాడు. ఆ నిధి తీస్తానని చెప్పి వారి నుంచి రూ.80 లక్షలు కాజేశాడు. ఓ రోజు రాత్రి బాధితుల స్వగ్రామం ఉండవల్లి శివారులోని వారి పొలంలో క్షుద్రపూజలు చేశాడు. అనంతరం ఇక్కడ అమ్మవారి విగ్రహం బయటపడిందని చెప్పి మూడడుగుల ఎత్తున్న విగ్రహాన్ని దంపతులకు చూపించాడు. ఈ విగ్రహాన్ని ఇంట్లో పెట్టుకుంటే ప్రాణహాని ఉంటుందని, అమ్మేస్తే రూ.కోట్లు వస్తాయని నమ్మబలికాడు. విగ్రహం కొనుగోలుకు విదేశాల నుంచి కొందరు దిల్లీకి వచ్చారని చెప్పి, ఐదు సార్లు బాధితులను దిల్లీకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో వారి నుంచి సుమారు రూ.3.50 కోట్లు వసూలు చేశాడు. చివరికి మోసపోయామని గ్రహించిన దంపతులు తమ డబ్బు తిరిగివ్వాలని దుర్గాసింగ్‌ను కోరారు. దాంతో అతడు బెదిరింపులకు దిగాడు. 'గ్రామంలోకి అడుగు పెడితే చంపేస్తామని దుర్గాసింగ్‌తో పాటు ముకుంద అనే వ్యక్తి మమ్మల్ని బెదిరించారు. దీనిపై పెబ్బేరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. గత నెల ఆదోనికి వచ్చి డీఎస్పీతో పాటు తాలూకా పోలీసు సీఐకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు' అని దంపతులు ఎమ్మెల్యే వద్ద బోరున విలపించారు. ఎమ్మెల్యే ఆదోని డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడగా, సాక్ష్యాలు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని డీఎస్పీ తెలిపారు.

# డాక్టర్‌ను ట్రాప్ చేసి 14 కోట్లు కొట్టేశారు!

**కొంపముంచిన ఫేస్‌బుక్‌పరిచయం**

**ఆమె సూచనతో పెట్టుబడి పెట్టి దివాళా**

**చైనీస్‌సైబర్ ఫ్రాడ్‌గ్యాంగ్‌గా గుర్తింపు**




**హైదరాబాద్, నవంబరు 29:** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఓ డాక్టర్ సర్వం పోగట్టుకున్నాడు. మోసాలను అడ్డుకునేందుకు పోలీసులు ఎన్నో రకాలు చర్యలు తీసుకున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో దూసుకుపోతున్నారు. ప్రజలను మోసం చేస్తూ భారీగా డబ్బులను కొట్టేస్తున్నారు. తమ మాయ మాటలతో ప్రజల బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను ఈజీగా సొంతం చేసుకుంటున్నారు. యాప్‌లను, కొత్త లింక్‌లను ఓపెన్ చేయొద్దని, ఓటీపీలు చెప్పవద్దని పోలీసులు పదే పదే చెబుతున్నారు. అయినా కూడా సైబర్ నేరగాళ్లు రోజుకో రకం మోసాలకు తెరతీస్తున్నారు. తాజాగా తెలంగాణలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఓ డాక్టర్..సైబర్ నేరగాళ్ల వలలో పడి పెద్ద మొత్తంలో నగదును పోగుట్టుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ డాక్టర్‌ను సైబర్ కేటుగాళ్లు ఎంతో ఈజీగా ట్రాప్ చేశారు. పెట్టుబడుల పేరుతో దాదాపు రూ.14 కోట్లను స్వాహా చేశారు. సదరు నేరగాళ్లు డాక్టర్‌ను సోషల్ మీడియా ద్వారా సంప్రదించారు. మోనిక మాధవన్ పేరుతో ఫేస్‌బుక్‌లో డాక్టర్‌కు మెసేజ్ చేశారు. ఆపై నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్ లింక్ పంపించారు నేరగాళ్లు. చాలా పెద్ద మొత్తంలో లాభాలు వచ్చాయని డాక్టర్‌ను నమ్మించారు. అయితే డబ్బు విత్ డ్రా చేయాలంటే ట్యాక్స్ కట్టాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. మొదట డాక్టర్ దానిని పట్టించుకోకపోవడంతో ట్యాక్స్ పే చేయాల్సిందే అంటూ అతడిపై సైబర్ నేరగాళ్లు తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. ఇక డబ్బులు భారీగా వస్తాయన్న భ్రమలో డాక్టర్ కూడా వచ్చే డబ్బు కోసం ఉన్న డబ్బును సైబర్ నేరగాళ్లకు సమర్పించుకున్నాడు. తాను ట్యాక్స్ పే చేసినప్పటికీ అవతలి నుంచి ఎలాంటి నగదు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సైబర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డాక్టర్‌కు వచ్చిన మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చింది?... ఎవరు పంపారు? అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏది ఏమైనా సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీ మొత్తంలో నగదును పోగుట్టుకోవద్దని ప్రజలకు సైబర్ పోలీసులు మరోసారి హెచ్చరించారు.

# కేసీఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు

## కొందరు మూర్ఖులు కనిపించడం లేదంటున్నారు

- కేసీఆర్‌ది దొంగదీక్ష అన్న వారికి ఉద్యమం ఏంతెలుసు
- కాంగ్రెస్ నేతలపై మండిపడ్డ బీఆర్ఎస్ నేత కేటీఆర్



**హైదరాబాద్, నవంబరు 29:** కొందరు మూర్ఖులు కేసీఆర్ కనిపించడం లేదని అంటున్నారని.. గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ దీక్ష.. దొంగ దీక్ష అని మాట్లాడుతున్నారని.. అడ్డమైన మాటలు కొందరు మాట్లాడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. సింహం తన గాధను తాను చెప్పుకోకపోతే, వేటగాడు చెప్పే పిట్టకథనే నిజం అనుకుంటారు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో అప్పుడే వస్తారని తెలిపారు. ఎదురుదాడి ఎలా చెయ్యాలో కేసీఆర్‌కు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదన్నారు. నాయకుడిని నాయకుడే అంటారని.. అర్భకుడిని అర్భకుడే అంటారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడితే తనకు అహంకారం అంటారని.. కానీ తాను ఇలానే మాట్లాడుతానని.. ఏం చేసుకుంటారో చూసుకోండి అని అన్నారు. మహాభారతంలో పాండవులు హీరోలు.. విలన్లు కౌరవులు అని.. అలాగే రామాయణంలో హీరో శ్రీరాముడు... విలన్ రావణుడని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ కథలో హీరో ఉన్నాడు... శకునులు, మారీచులు ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. చరిత్రను మలుపు తిప్పిన రోజు కేసీఆర్ దీక్ష చేసిన రోజు అని చెప్పుకొచ్చారు. సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న కేసీఆర్ నినాదం సునామీ సృష్టించిందన్నారు. కేసీఆర్ దీక్ష విఫలం కావాలని చాలా మంది ప్రయత్నం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ అనే పదాన్ని ఎవరూ తుడిచివేయలేరని స్పష్టం చేశారు. టైం బాగాలేనప్పుడు గ్రామ సింహాలు కూడా పులుల్లా గర్జిస్తాయంటూ ఎద్దేవా చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అననోళ్ళు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. మొదటి నుంచి విలన్ పాత్ర పోషిస్తున్నది కాంగ్రెస్ పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైఎలక్షన్స్‌కు రావాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి సవాల్ విసిరారు. సోనియా గాంధీని బలిదేవత అన్నది ఇప్పుడున్న ముఖ్యమంత్రి అని గుర్తుచేశారు. సోనియా గాంధీకి అసెంబ్లీలో ధన్యవాదాలు తెలిపిన సంస్కారి కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ దొంగ దీక్ష అయితే ఆనాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విరమించమని చెప్పిందని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకుందామని దీక్షా దివస్ సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ హీరోలను విలన్లుగా చిత్రీకరిస్తుందని విమర్శించారు. కాళేశ్వరం మీద కుట్ర జరిగిందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను బాంబులు పెట్టి కూల్చివేసే ప్రయత్నం జరిగిందన్నారు. గులాంల ఎగురులాట కొంత కాలమే... వచ్చే కాలమంతా గులాబీలదే అంటూ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.



# దీక్షా దివస్ పేరుతో డ్రామాలు

## బిఆర్ఎస్ నేతలపై మండిపడ్డ సీతక్క

**హైదరాబాద్, నవంబరు 29:** బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసేవాళ్లని.. అధికారం పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని డిమాండ్ చేశారు. అది చెపివుంటే ప్రజలు గమనించే వారని అన్నారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందన్నారు. ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వీటిని అడ్డుకునే కుట్రతోనే దీక్షా దివస్ పేరుతో బిఆర్ఎస్ నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ది పొందింది కేసీఆర్ కుటుంబమేనని అన్నారు. అమరులు పోయారు ..వారి కుటుంబాలు పోయాయని అన్నారు. కానీ బిఆర్ఎస్ నేతలు మాత్రం కోట్లకు పడగలెత్తారని మండిపడ్డారు. ఆ పార్టీ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయి. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం.. లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీక్షా దివస్ పేరుతో చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరని మంత్రి అన్నారు. కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో ఆమెపై అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరయ్యారు.

# భూములు అమ్ముకునే కుట్ర

- గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం
- సీఎం రేవంత్‌పై సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ ఆరోపణలు



సిద్ధిపేట, నవంబరు 29: గ్లోబల్ సమ్మిట్ పెట్టి భూములు అమ్ముకునేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం రియల్ వ్యాపరమం కోసమే ఈ సమ్మిట్ అని ఆరోపణలు చేశారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ..నవంబర్ 29వ తేదీ ఒక చరిత్ర.. ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు ఇదని చెప్పుకొచ్చారు. ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేశారు. సిద్దిపేటలో జరిగిన ఉద్యోగుల గర్జన ఒక చరిత్ర అని వివరించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష ఒక చరిత్ర.. ఎన్నో త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు.'తెలంగాణ రాష్ట్రం కోసం మాజీ సీఎం కేసీఆర్ పోరాడారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేసీఆర్ పోరాటం గురించి మూర్ఖంగా మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9వ తేదీ తెలంగాణ రాష్ట్ర ప్రకటన కేసీఆర్ దీక్ష ఫలితమే. మిలియన్ మార్చ్ మా వంతు.. మిలియన్‌ల కొద్దీ డబ్బు మూటలు కట్టి ఢిల్లీకి పంపుడు కాంగ్రెస్ వంతు. తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డికి కోదండ రామ్ దగ్గర అయ్యారు. మన నిధులు, మన నీళ్లు మనకు దక్కేలా చేసింది కేసీఆర్. కృష్ణానది నీళ్ల పంపకంపై ఆంధ్రప్రదేశ్.. తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా ట్రైబ్యునల్ ముందు మూడు రోజులుగా వాదిస్తుంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఈ విషయంపై మాట్లాడటం లేదు. తెలంగాణ రాష్ట్ర మూడు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచాలని చూడొద్దు. తెలంగాణ రావడంతోనే మన రాష్ట్రం పచ్చని మాగాణిగా మారి పంటలు పండుతున్నాయి. రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పోరాట చరిత్ర ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం దీక్ష దివస్ జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన ఉద్యమకారుడు అందెశ్రీకి నివాళులు అర్పించారు నాయకులు. అంతకుముందు దీక్షా దివస్ సందర్భంగా సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా నుంచి పొన్నాల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఆవరణలో ఉద్యమ స్ఫూర్తి పైలాన్‌ను తిరిగి ఆవిష్కరించారు.

# హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు

## 3న సిఎం చేతుల మీదుగా ప్రారంభం

## పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన పొన్నం



**సిద్దిపేట, నవంబరు 29:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలో భాగంగా డిసెంబర్ 3వ తేదీన హుస్నాబాద్‌లో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో హుస్నాబాద్ పట్టణ శివారులోని ఏనె వద్ద మైదానంలోని బహిరంగ సభ ప్రాంగణాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. పోలీసులకు మంత్రి పొన్నం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలన ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన అభివృద్ధి, ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులపై ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల సహకారంతో మిగిలిన సమస్యలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిష్కరించి ముందుకెళ్లే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల మధ్యలో కేంద్రంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సభకు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# దీక్షా దివస్ అంటే స్వాతంత్ర్య దినోత్సవమే

- తెలంగాణ వచ్చేదాకా దీక్ష విరమించని కెసిఆర్
- భువనగిరి దీక్షా దివస్‌లో మాజీమంత్రి జగదీశ్ రెడ్డి




**యాదాద్రి భువనగిరి, నవంబరు 29:** కేసీఆర్ నా శవయాత్ర.. తెలంగాణ జైత్ర యాత్ర ఒకేసారి జరగాలి అన్నారని.. అప్పటిదాకా దీక్ష విరమించేది లేదని పట్టుబట్టారని అంటూ ఆనాటి ఘటనలను మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. ఆనాటి ఆంధ్రా పోలీస్‌లు, నాయకులు ఎన్నో జిమ్మిక్కులు చేశారని.. అయినా అన్నింటిని ఛేదించి తెలంగాణ సాధించామన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివస్ వేడుకల్లో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 29 దీక్ష దివస్ మనందరికీ స్వాతంత్ర్యం తెచ్చిన రోజు అని తెలిపారు. దేశానికి ఆగస్టు 15 ఎలాగో, మనకు నవంబర్ 29 అలాగేనన్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి, మొక్కవోని పట్టుదలతో దీక్ష చేసి, ఢిల్లీ మెడలు వంచిన రోజనరి పేర్కొన్నారు. కేసీఆర్ దీక్ష చేసిన 11 రోజులు ఒక్కోక్షణం ఒక్కో భయంతో గడిపామని.. తమ నేతకు ఏమైనా అయితే తెలంగాణ ఎటు పోతుందో అని కన్నీరు పెట్టామన్నారు. కే హైదరాబాద్ లేకుండా తెలంగాణ అన్నారని.. అప్పుడు కేసీఆర్ గుండె లేని మనిషి వున్నా లేనట్లే హైదరాబాద్‌తో కూడిన తెలంగాణనే కావాలని పట్టుబట్టారన్నారు. ఢిల్లీ గడగడ లాడిపోయిందని.. తెలంగాణ బెబ్బులిలా నిలబడి బరిగీసి కొట్లాడింది.. లక్ష్యం ముద్దడినం అంటూ గుర్తు చేశారు. కేసీఆర్ అంటే తెలంగాణ తెచ్చిన ముఖ్యమంత్రి.. తెలంగాణ కోసం చావు అంచుల దాకా, పేగులు తెగే దాకా కొట్లాడిన ఉక్కు మనిషి కేసీఆర్ అన్నారు. అలాంటి కేసీఆర్‌పై ఇప్పుడు కాంగ్రెస్ దొంగలు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని.. తస్మాత్ కొడుకుల్లారా.. కేసీఆర్‌పై నోరు జారితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి దేవుడని.. అందరి గుండెల్లో గూడు కట్టుకున్న మహానేత మా కేసీఆర్ అన్నారు. కేసీఆర్ సైనికులుగా మేమంతా తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పని చేశామని.. ఇప్పుడు వస్తున్న 24 గంటల కరంట్, మంచి నీళ్లు, పాడి పంటలు, తెలంగాణ ఆదాయం అన్ని అన్ని కేసీఆర్ సాధించినవేనన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్ల అనుభవిస్తున్న పదవులు అన్ని కేసీఆర్ తెచ్చినవేనని.. కేసీఆర్‌పై కుట్రలు చేయని పార్టీ లేదని.. ఎప్పుడు పిల్లి శాపనార్థాలు పెడతారని విమర్శించారు. ఇప్పుడు కూడా కేసీఆర్ ఆరోగ్యం బాగాలేదని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని.. కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. తెలంగాణ అభివృద్ధి జరిగిగేది ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని.. తెలంగాణ వాదులపై తుపాకీ ఎక్కుపెట్టిన దుర్మాగుడు రేవంత్.. ఆయన పాలనే ఇప్పుడు నడుస్తుండడం దౌర్భాగ్యమన్నారు. తెలంగాణలో లాఠీ, లూఠీ పాలన నడుస్తుందని.. తెలంగాణ కాంగ్రెస్ విముక్త రాష్ట్రంగా అయ్యేంత వరకు పోరాటం చేద్దామంటూ జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ దీక్షా దివస్

## సిద్దిపేటలో హరీష్ రావు బైక్ ర్యాలీ ■ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ నివాళి




**హైదరాబాద్, నవంబర్ 29:** రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. సిద్దిపేటలో అంబేద్కర్ విగ్రహానికి హరీశ్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్‌లోనూ దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ భవన్‌కు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడ్డారని పేర్కొన్నారు. తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే అని చెప్పారు. ఖమ్మంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, చంద్రావతి పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దీక్షా దివస్ సందర్భంగా సంగారెడ్డిలో అమరవీరులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్ ఇతర బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు.



## సంపాదకీయం

# రాజకీయ పార్టీల నిబద్ధతకు పరీక్ష!

రాజకీయాల్లో సంకల్ప బలం ముఖ్యం. తమతో పాటు బడుగుబలహీన వర్గాలను ముందుకు తీసుకుని వెళ్దామన్న ప్రయత్నం చేయాలి. ఎంతసేపు వారే పల్లకి మోయాలన్న ఫ్యూడల్ భావాలను వీడాలి. పల్లకి ఎక్కే అవకాశం వారికి కూడా కల్పించాలి. వారినీ సానబెట్టి రాటదేలేలా చేయాలి. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ల అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఇదే అదనుగా కాంగ్రెసేతర పార్టీలు కాంగ్రెస్‌ను తిట్టిపోస్తూ రాజకీయంగా లబ్దిపొందాలని చూస్తున్నాయి. నిజానికి రాజకీయంగా లబ్ది పొందాలంటే ఆయా వర్గాల్లో పట్టును సాధించాలి. అందుకు పార్టీ పరంగా ఆయా వర్గాలను ముందుకు తీసుకుని వెళ్లాలి. హైకోర్టు తీర్పు తరవాత గత్యంతరం లేని పరిస్థితు ల్లో ప్రభుత్వం పాతపద్ధతిలోనే స్థానిక ఎన్నికలకు సిద్దం అయ్యింది. ఇది ఆహ్వానించదగ్గ విషయం. రిజర్వేషన్లు ఉంటేనే బిసిలను, ఎస్సీ,ఎస్టీలను ఆదరించడం కాదు...లేకున్నా వారికి రాజకీయంగా ప్రవేశం కల్పించాలి. ఇప్పుడు రాజకీయ పార్టీలు అదేపనిగా పాత వ్యవహారాలను తవ్వుతూ పోకుండా తమ పార్టీ పరంగా బిసిలు, ఎస్సీలు, ఎస్టీలను రాజకీయాంగా పైకి తీసుకుని వచ్చే ప్రయత్నాలు చేయాలి. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టగానే ఎందరో ఎస్సీలు, ఎస్టీలు, బిసిలకు టిక్కెట్లు ఇచ్చి రాజకీయంగా వారికి అండగా నిలిచారు. అనామకులు ఎందరో రాజకీయంగా తెరపైకి చ్చారు. గుంటూరులో కాంగ్రెస్ దిగ్గజం ఆచార్య ఎన్‌జి రంగా లాంటి వారు అనామకుడి చేతిలో ఓటమి చెందారు. అలా ఆనాడు ఎన్టీఆర్ సృష్టించిన ప్రభంజనంలో మహామహులు ఓటమి చెందారు. కొత్త తరం రాజకీయాల్లోకి వచ్చింది. అలా రాజకీయాల్లోకి వచ్చి నిలదొక్కుకున్న వారు నిలదొక్కుకున్నారు. ఆ తరవాత అదే ఒరవడి సాగింది. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బడుగు, బలహీనవర్గాల రాజకీయ ప్రవేశాలకు నాంది పలికింది. కుల ప్రాతిపదికను మొదటి కమిషన్ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే, కులాన్ని ఒక సూచికగా తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం మండల్ కమిషన్ తీర్పులో స్పష్టం చేసింది. 1992లో ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని ఇచ్చిన తీర్పు ఫలితంగా తమిళనాడు సహా ఎన్నో రాష్ట్రాల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. చివరికి ఇందిరా సహాని కేసు కూడా పరీక్ష ఎదుర్కొనక తప్పలేదు. తమిళనాడు 69శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ సుప్రీంకోర్టు విధించిన పరిధి వల్ల సందిగ్ధత ఏర్పడింది. దీంతో అసెంబ్లీలో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి, 69శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేట్టు, సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిధి నుండి రక్షణ పొందడానికి రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చేట్టుగా అప్పటి ముఖ్యమంత్రి జయలలిత పావులు కదిపారు. అయితే ఇదంతా అసెంబ్లీ, పార్లమెంట్ వ్యవహారాల్లో పోరాడాల్సిన అంశం. అప్పటి వరకు ఈ వర్గాలను దూరం చేసుకోవడం తగదు. నిజానికి ఈ వర్గాలను దగ్గరకు చేసుకునేందుకు ఇదో మహత్తర అవకాశంగా రాజకీయ పార్టీలు భావించాలి. సర్పంచ్ పదవి అన్నది ఎవరైనా రాజకీయంగా ఎదగడానికి పరమపద సోపానం లాంటిది. యువతను రాజకీయాల్లో ఆహ్వానిం చేందుకు, గ్రామాలను అభివృద్ధిలో నిలిపేందుకు ఇదో మంచి అవకాశం. అధికార కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు సర్పంచ్ ఎన్నికల్లో వివిధ కులవర్గాలకు చెందిన సమర్థులైన యువతను నిలపాలి. చదువున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. నిజాయితీ రాజకీయాలను ప్రోత్సహించాలి. అందుకు రిజర్వేషన్లు లేనిచోట్ల ఎస్సీ,ఎస్టీ, బిసి వర్గాలను నిలబెట్టాలి. వారంతా రాజకీయంగా ఎదగడానికి అవకాశం వస్తుంది.దీంతో రాజకీయాల్లో కొత్తనీరు రావడానికి ప్రాతిపదిక వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించక తప్పడం లేదు. మరొకవైపు శాసనసభలో చేసిన తీర్మానాలకు కట్టుబడి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రక్షణ కల్పించేలా 9వ షెడ్యూల్‌ను ఆశ్రయించాలనే ఉద్యమం కొనసాగుతోంది. ఈ విషయంలో ప్రచారం వేగంగా మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా చేరింది. గ్రామాల్లో కూడా ఇప్పుడిప్పుడే యువత రాజకీయాల వైపు మొగ్గుచూపుతోంది. ఎంతకాలం వృద్ధ జంబుకాలే పార్టీల్లో వేలాడకుండా కొత్తతరాన్ని ఆహ్వానించాలి. సమాజంలో అట్టడుగుస్థాయి వర్గాలను వెతికి పట్టుకుని, వారిని రాజకీయాల్లో ముందుకు తీసుకుని రావాలి. ఎంతకాలం వారిని కేవలం కార్యకర్తలుగానే ఉపయోగించకునే దౌర్భాగ్యం నుంచి బయటపడి నవతరం నాయకత్వం అవతరించే దిశగా నేడు పార్టీలు అడుగులు వేయాలి. పార్టీపరంగా వారికి అండదండలు కల్పించాలి. సవాళ్లను ఎదుర్కోవడానికి నిరంతర అవగాహన కల్పించాలి. వారిని రాజకీయాల్లో రాటుదేలేలా చేయాలి. విద్యార్థి ఉద్యమాలతో రాటుదేలిన వారిని ముందుకు దింపాలి. ఇందుకు పార్టీపరంగా సమైక్య పోరాటం అనివార్యంగా గుర్తించాలి. తెలంగాణ శాసనసభలో చేసిన ఏకగ్రీవ తీర్మాణాలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు 42శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపాయి. అదే స్ఫూర్తితో బీసీ సభ్యులను ఇప్పుడు గెలిపించుకోవాలి. పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ ఎన్నికకు పార్టీ గుర్తు ఉండదన్న నెపంతో వీరిని పక్కన పెట్టాలని చూస్తే అసెంబ్లీ తీర్మానాలకు విలువ ఉండదు. అందువల్ల అన్ని పార్టీలు ఈ విషయంలో తీవ్రంగా ఆలోచన చేసి, రిజర్వేషన్లు లేనిచోట్ల వివిధ వర్గాల అభ్యర్థులను నిలబెట్టి ముందుకు నడిపించాలి. రాజకీయాలలో ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా మనకు సమానత్వం ఉంది. కానీ సామాజిక, ఆర్థిక జీవితంలో మనకు అసమానతలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా రాజకీయాల్లో పదవుల పందేరంలో ఇప్పటికీ అంగ్రవర్గాలదే పైచేయిగా ఉంటోంది. మనం ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తొలగించాలి. లేకుంటే అసమానతలు ఎదుర్కొంటున్న వారిలో ఆవేశం కట్టలు తెంచుకుంటే, అజమాయిషీ చెలాయిస్తున్న వారు అడుసులో కూరుకు పోతారు. ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని బలోపేతం చేయాలంటే అసమానతలు అన్నవి తొలగించుకుంటూ పోవాలి. అందుకు రిజర్వేషన్లే ప్రాతిపదిక కానవసరం లేదు. రాజకీయ సంకల్పం ఉంటే ఇది సాధ్యం అవుతుంది. ఉన్నత వర్గాల వారికి చట్టసభల్లో స్థానాలు తగ్గించి, బీసీ వర్గాలకు స్థానాలు పెంచడం వల్ల సామాజిక సామరస్యత వస్తుంది. ఇప్పుడు రిజర్వేషన్ల కోసం కొట్లాడుతున్న బీసీ నాయకులను ఎన్నికలలో గెలిపించిన చరిత్రను లిఖించినవారు అవుతారు.

# శ్రీలంకలో ద్విత్వా తుపాను బీభత్సం


- వరదలకు ఇప్పటికే 123మంది మృతి
- మరికొందరి ఆచూకీ గల్లంతు
- దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటన




**కొలంబో, నవంబరు 29:** దిత్వా తుఫాను కారణంగా శ్రీలంక చిగురుటాకులా వణికింది. ఈ ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటి వరకు 123 మంది మరణించగా.. అనేక మంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో శ్రీలంక ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. వరదల వల్ల ఏర్పడిన విధ్వంసం కారణంగా తలెత్తిన అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే దేశమమంతటా అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. శనివారం శ్రీలంకను దాటిన దిత్వా తుఫాను 123 మందికి పైగా ప్రాణాలను బలిగొందని, విధ్వంసం, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిందని ఆ దేశ అధికారులు తెలిపారు. 'దిత్వా శ్రీలంక నుండి భారత తీరం వైపు వెళ్లింది. ఈ క్రమంలో భారీ వర్షం, అధిక వేగంతో కూడిన గాలులు వీశాయి. ఈ తుఫాన్ కారణంగా ఇప్పటికే అనేక ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయి. ఎంతో మంది జీవనం అస్తవ్యస్తంగా మారింది' అని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ అతుల కరుణనాయకే మీడియాతో తెలిపారు. ఇదే సమయంలో విపత్తు నిర్వహణ కేంద్రం శనివారం ఓ ప్రకటనలో పలు విషయాలను వెల్లడించింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయనియని తెలిపింది. 43వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ సంపత్ తెలిపారు. పోలీసులు, అధికారులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నా యన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. వందలమందిని తాత్కాలిక పునరావాసాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ వెల్లడించారు.

# స్లీపర్ బస్సు ప్రమాదాలపై ఆందోళన

- ఆ బస్సులను తక్షణం పక్కన పెట్టేయండి
- రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశం



**న్యూఢిల్లీ, నవంబరు 29:** ఇటీవల స్లీపర్ బస్సుల కారణంగా జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ రంగంలోకి దిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్లీపర్ బస్సులను తక్షణం పక్కనపెట్టేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్‌హెచ్‌ఆర్సీ మార్గదర్శకాల ప్రకారం.. ఏఐఎస్:052, ఏఐఎస్:119 నిబంధనల మేరకు వాహనాలు ఉండేలా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ సమయంలో చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. బస్-బాడీ బిల్డింగ్ సంస్థలు, వాహనాల ఆపరేటర్లు నిబంధనలను అతిక్రమించకుండా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వాహనాల భద్రతకు సంబంధించి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు (సీఐఆర్‌టీ) మార్గదర్శకాలను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేయాలి. ఎమర్జెన్సీ సమయాల్లో అడ్డంకిగా మారే అవకాశం ఉన్న బస్సులోపలి ఏర్పాట్లను తొలగించాలి. అవసరమైన మేరకు బస్సులను రికాల్ చేసి మార్పులు చేసేలా మార్గదర్శకాలు జారీ చేయాలి. మోటార్ వాహన చట్టం, ఏఐఎస్ ప్రమాణాల ఉల్లంఘనలకు బస్సు తయారీదారులతో పాటు అధికారులు కూడా బాధ్యులు అయ్యేలా చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాద ఘటనల్లో బాధితులకు సహాయం, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్సీ వద్ద ఫిర్యాదు దాఖలైంది. నిబంధనల అతిక్రమణ కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఇది జీవించే హక్కు ఉల్లంఘనేనని తెలిపారు. దీంతో.. ప్రమాదానికి గల కారణాలపై అధ్యయనం నిర్వహించాలని సీఐఆర్‌టీని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది.

## అక్స్‌ఫర్డ్ చర్చలకు రాకుండా

# అబద్ధాల ప్రచారం

### భారత్‌పై నోరు పారేసుకున్న పాక్ ప్రతినిధులు

### గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి



**న్యూఢిల్లీ, నవంబర్ 29:** తప్పుడు ప్రచారాలు చేయడం ద్వారా తప్పుకోవడం అలవాటు చేసుకున్న పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. యూకేలో జరిగే ప్రముఖ చర్చలో పాల్గొనకుండా.. భారత్ అధికారులు వెనుదిరిగారంటూ తప్పుడు ప్రచారానికి తెర లేపింది. అయితే, దీన్ని భారత్ గట్టిగా తిప్పికొట్టింది. వివరాల్లోకి వెళితే.. యూకేలో ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో గురువారం భారత్-పాక్ అధికారుల మధ్య చర్చజరగాల్సి ఉంది. ఇందులో భారత్ తరఫున మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవాణెళి, సుబ్రమణియన్ స్వామి, రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్‌లు పాల్గొనాల్సి ఉంది. పాక్ నుంచి ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ, యూకేలోని రాయబారి మొహమ్మద్గ్ ÷సైల్, రిటైర్డ్ జనరల్ జుబైరా మహమూద్ హయత్‌లు హాజరుకానున్నారు. అయితే, ఈ చర్చలో పాల్గొనకుండా భారత్ అధికారులు చివరి నిమిషంలో వెనుదిరిగారంటూ యూకేలోని పాక్ రాయబార కార్యాలయం తప్పుడు ప్రచారానికి తెరలేపింది. 'పాక్ బృందం ఇప్పటికే లండన్‌లో సిద్ధంగా ఉంది. ఆక్స్‌ఫర్డ్ చర్చల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే, ఇందులో పాల్గొనకుండా భారత్ బృందం వైదొలగాలని నిర్ణయించుకుందని యూనియన్ నిర్వాహకులు తెలిపారు. అందుకు గల కారణాలు మాత్రం తెలపలేదని ఎక్స్‌లో రాసుకొచ్చింది. అయితే పాక్ అబద్ధపు ప్రచారాన్ని భారత్‌కు చెందిన సీనియర్ న్యాయవాది సాయి దీపక్ గట్టిగా తిప్పికొట్టారు. పాక్ తన తప్పుడు ప్రచారాలను ఇంకా కొనసాగిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. సుబ్రమణియన్, నరవాణెళి కొన్ని కారణాల వల్ల చర్చకు హాజరుకాలేకపోతున్నందున, వీరికి ప్రత్యామ్నా యాలు చూపాలని యూనియన్ అధికారులు తనను కోరారని దీపక్ చెప్పారు. ఈ క్రమంలో తాను యూకేకు వెళ్లి మరో బృందంతో చర్చకు సిద్ధమయినట్లు తెలిపారు. అయితే.. చర్చకు కొన్ని గంటల ముందు యూనియన్ అధికారులు తనకు కాల్ చేసి.. పాక్ తరఫున హాజరవ్వాల్సిన బృందం యూకేకు రాలేదని వెల్లడించారన్నారు. దీంతో చర్చ ఆగిపోవడం తనకు ఆగ్రహం తెప్పించిందన్నారు. పాక్ బృందం కూడా యూకేలోనే ఉందని, భారత్‌తో చర్చల్లో పాల్గొనేందుకు భయపడి వెనుదిరిగినట్లుగా కనిపిస్తుందని విమర్శించారు. తమను ఎదుర్కోలేక పిల్లల వెనక దాక్కుందని ఎద్దేవా చేశారు. దాయాది బృందం ఇంకా ఆక్స్‌ఫర్డ్‌లోనే ఉంటే.. తమతో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. దీపక్ పోస్టులతో పాక్ ప్రకటనలు తప్పు అని మరోసారి స్పష్టమైంది. పాక్ చర్చలో పాల్గొనాల్సి వస్తే బేలతనం బయటపడుతుందనే ఇలా చేసి ఉంటుందని అనుకుంటున్నారు.

## ఢిల్లీ పేలుడు నిందితులకు మరో పదిరోజుల జ్యుడిషియల్ కస్టడీ

**న్యూఢిల్లీ, నవంబరు 29:** ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితులైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనయి, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథెర్, డాక్టర్ సహీన్ సయీద్, ముఫ్తో ఇర్ఫాన్ అహ్మద్ వాగాయ్‌కు 10 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పాటియాలా హౌస్ కోర్టు శనివారం ఆదేశించింది. ఇంతకుముందు విధించిన 10 రోజుల కస్టడీ శనివారంతో ముగియడంతో ఈ నలుగురిని కోర్టు ముందు హాజరుపరిచారు. జమ్మూకశ్మీర్ పోలీసులు వెలుగులోకి తీసుకువచ్చిన 'వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్'కు సంబంధించి ఇంతవరకూ ఏడుగురికి పైగా అనుమానితులను అరెస్టు చేసారు. ఈ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌కు నేరుగా ఢిల్లీ పేలుడుతో సంబంధం ఉందని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.

## 1 నుంచి పార్లమెంట్ శీతాకా సమావేశాలు

### రాజ్‌నాథ్ అధ్యక్షతన నేడు అఖిలపక్ష భేటీ

**న్యూఢిల్లీ, నవంబరు 29:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించ నున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలపై చర్చకు విపక్షం కసరత్తు చేస్తోంది. సర్‌తో సహా ఢిల్లీ కాలుష్యం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇకపోతే కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన 'ది ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో 'ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, ది హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, ది మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉండనున్నాయి. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956ను విలీనం చేసేందుకు 'సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025'ను కేంద్రం తీసుకువస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ, పొడిగింపుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా, అత్యంత పారదర్శకంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్ (సవరణ) బిల్లును తెస్తోంది. చేయని తప్పులకు కంపెనీ డైరెక్టర్లు బాధ్యులు అవుతున్నందున అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలేయేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనిపై సూచనల కోసం కమిటీకి సిఫారసు చేసే అవకాశం ఉంది. కాగా, ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లుతో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకురానుంది. కాగా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణ పరిధిలోకి తెచ్చే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని అనుకున్నప్పటికీ అలాంటి ఆలోచన ఏదీ లేదని ఇటీవల కేంద్రం ప్రకటించింది. కాగా, ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ జాబితా, అదానీ అంశం, ఢిల్లీ పొల్యూషన్ వంటి అంశాలను లేవనెత్తే అవకాశాలున్నాయి. దీనికి సంబంధించిన విపక్ష నేత రాహుల్ ఇప్పటికే ప్రకటన చేశారు.



# 'మాజీ మావోలు.. మాట పైలం!'

- ప్రాణం మీదకు తెచ్చిన యూట్యూబ్ ఇంటర్వ్యూ
- వ్యూస్ కోసం వెలికితీసిన రహస్యాలు.. మాజీ మావోల ప్రాణాలపై చీకటి నీడలు
- ప్రసార మాధ్యమాల ఎరకు చిక్కి ప్రాణం మీదకు తెచ్చుకున్న చంద్రన్న



**రాజకీయాలు, పాత పగలు, గత కాలపు అగ్నికణాలు.. ఇవన్నీ మళ్లీ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రహారం గుట్టల్లో ఒక్కసారిగా చెలరేగి ఒక మాజీ మావోయిస్టు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. ఇది గత దశాబ్దాల మావో ఉద్యమ చరిత్రలో నిక్షిప్తమైన పగలు, బాధలు, రక్తకథలు.. ఇవన్నీ ఇంటర్నెట్ యుగంలో మళ్లీ బయటికి వస్తున్న కొత్త ప్రమాద సంకేతం కూడా.**

(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)

సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటకు చెందిన సిద్ధన్న (57) దశాబ్దకాలం పాటు పీపుల్స్ వార్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఇటీవల ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన 1990 దశకంలో జగిత్యాల జిల్లాకు చెందిన ఒక వ్యక్తి హత్యలో తాను పాల్గొన్నట్లు వెల్లడించారు. ఆ వీడియోను చూసిన ఆ వ్యక్తి కుమారుడు జక్కుల సంతోష్, సిద్ధన్నపై తీవ్ర కక్ష పెంచుకున్నట్లు విచారణలో బయటపడింది. యూట్యూబ్ ద్వారా తన తండ్రిని చంపిన వ్యక్తి సిద్ధన్నే అని తెలుసుకున్న జక్కుల సంతోష్ తన తండ్రిని చంపిన వాడిని ఎలాగైనా చంపేయాలన్న కసితో ప్రతీకారంతో రగిలిపోయాడు. పక్క ప్రణాళికతో సిద్ధన్నతో తన అభిమానిగా పరిచయం చేసుకున్న సంతోష్ అతనితో తరచూ కలుస్తూ నమ్మకం తెచ్చుకున్నాడు. దావత్ చేసుకుందామని సిద్ధన్నను అగ్రహారం గుట్టల్లోకి తీసుకెళ్లి రాళ్లతో కొట్టి హతమార్చాడు. అనంతరం సంతోష్ జగిత్యాల పోలీసులకు స్వయంగా లొంగిపోయి హత్య చేసినట్లు అంగీకరించాడు. మావోయిస్ట్ ఉద్యమంలో సిద్ధన్న పేరు చిన్నది కాదు.

2003లో ఒక్క రోజులో తొమ్మిది మంది సహచరులు "కోవర్టు హత్యాకాండ"లో బలైపోయినప్పుడు సిద్ధన్న అక్కడే ఉన్నాడు. ఆ ఘటన అతని మనసును జీవితం మొత్తం వెంటాడిందని కూడా ఇంటర్వ్యూలో చెప్పాడు. 2004లో పోలీసులకు లొంగిపోయిన తరువాత జీవన యాత్ర మార్చుకున్నా%ౌ% గతం మాత్రం జీవితం అంతా వెంటాడింది. ఇప్పుడు మరణం రూపంలో ఎదురయ్యింది.

### యూట్యూబ్ ఇంటర్వ్యూలు.. మాజీ నక్సలైట్లకు కొత్త ముప్పు

ఇటీవలి కాలంలో లొంగిపోయిన మాజీ మావోయిస్టులు యూట్యూబ్ ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇస్తూ పాత సంఘటనలను, హత్యలను, పార్టీ ఆదేశాలను బయటపెడుతున్నారు. చానళ్లకు ఇది సెన్సేషన్. వ్యూస్ పెంచే సమాచారం. కానీ మాజీ నక్సలైట్లకు మాత్రం ఇది కొత్త సంక్షోభానికి, ప్రమాదానికి దారితీస్తుందని తెలియడం లేదు. వ్యూలు పెంచడానికి ఇంటర్వ్యూలలో పలు యూట్యూబర్లు పాత నేరాల గురించి మాట్లాడే విధంగా ప్రేరేపిస్తుండటం.. మాజీ నక్సలైట్లను ఇరుకున పెడుతోందని వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారు. సిద్ధన్న హత్య దీనికే పెద్ద నిదర్శనం. గత కొన్నేళ్లుగా లొంగిపోయిన మాజీ మావోయిస్టుల కథలు యూట్యూబ్‌లో హిట్ అయ్యాయి. మరిన్ని వీక్షణలు, మరిన్ని ఇంటర్వ్యూలు, మరిన్ని ఒప్పుకోలు.. అయితే ఈ ఒప్పుకోళ్లే పాత పగలకు తలుపులు తెరుస్తున్నాయి. సిద్ధన్న హత్య ఈ ధోరణికి తాజా ఉదాహరణ. "గతంలో నేను ఇలా చేశాను" అని చెప్పడం, అదే గతం మళ్లీ కత్తిలా తిరిగి వారిపై పడడం, అదే ఇప్పుడు ప్రజాబాహుల్యంలో చర్చగా మారింది. మాజీ మావోయిస్టులు తమ గతాన్ని వివరించే ప్రతి ఇంటర్వ్యూలో.. తాము మర్చిపోయినా, బాధిత కుటుంబాలు మాత్రం మర్చిపోవు. "ఏ మాట అయినా పగను మళ్లీ రగిలిస్తుంది" అనేది ఈ ఘటన చెప్పిన పెద్ద సందేశం.

**అడవుల్లో జరిగిన రక్తకథలు బయటపెట్టే ప్రతి మాట.. ఎవరి హృదయంలో ఎప్పుడు మంట రగులుతుందో ఎవరికీ తెలియదు. అందుకే మరోసారి గుర్తు చేసే మాట 'మాజీ మావోలు.. జర మాట పైలం! పబ్లిక్‌లో చెప్పే ప్రతి మాట.. యూట్యూబ్‌లో వెలుగులోకి వచ్చే ప్రతి నిజం.. సెంకండ్లలో వ్యూస్ పెంచుతుందేమో, కానీ అదే మాట సంవత్సరాలుగా దాగి ఉన్న పగలను మళ్లీ సజీవం చేస్తుందనే వాస్తవాన్ని సిద్ధన్న మరణం మరోసారి వెలుగులోకి తెచ్చింది.**

# మీ చేతి వేళ్ల గోర్లపై ఇలా తెల్లని మచ్చలు ఉన్నాయా..?

## అయితే ఏం జరుగుతుందో తెలుసా..?

మన శరీరంలో ఏవైనా వ్యాధులు వస్తే వెంటనే బయట పడవు. ముందుగా వాటి తాలూకు లక్షణాలు కొన్నింటిని శరీరం బయట పెడుతుంది. ఏ అనారోగ్య సమస్య వచ్చినా సరే ముందుగా మన శరీరం దాని లక్షణాలను మనకు తెలియజేస్తుంది. ఈ క్రమంలో ఆయా లక్షణాలను మనం ముందుగానే గుర్తిస్తే వ్యాధి తీవ్రత పెరగకుండా, ప్రాణాంతకం అవకుండా ముందుగానే చికిత్స తీసుకుని జాగ్రత్తగా ఉండవచ్చు. ఇక మన శరీరంలో పలు రకాల పోషకాల లోపం ఉన్నా కూడా శరీరం లక్షణాలను తెలియజేస్తుంది. కనుక ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వ్యాధి నిర్ధారణకు రాకుండా ముందుగా డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకుని అవసరం అయితే అప్పుడు మందులను వాడాలి. అంతేకానీ సొంతంగా వైద్యం చేసుకోకూడదు. ఇక మన శరీరం తెలియజేసే అనేక లక్షణాల్లో చేతి వేళ్ల గోర్లపై తెల్లని మచ్చలు ఏర్పడడం కూడా ఒకటి. ఈ మచ్చలు ఏర్పడేందుకు పోషకాల లోపంతోపాటు పలు వ్యాధులు ఉండడం కూడా కారణాలు అవుతాయి. కనుక దేని వల్ల ఈ మచ్చలు ఏర్పడ్డాయో తెలుసుకోవడం మంచిది.



**మహిళలకు..**

చాలా మందికి అప్పుడప్పుడు చేతి వేళ్లకు చెందిన గోర్లపై తెల్లని మచ్చలు ఏర్పడుతుంటాయి. కొందిరికి ఇవి మచ్చల్లా ఏర్పడితే కొందరికి తెల్లని గీతల్లా ఏర్పడుతాయి. అయితే ఎలా ఏర్పడినా ఈ మచ్చలు కనిపిస్తే మాత్రం అసలు నిర్లక్ష్యం చేయకూడదు. కొందరికి ఈ తెల్లని మచ్చలు చిన్నగా ఉంటే, కొందరికి వెడల్పుగా ఏర్పడుతాయి. అలాగే కొందరికి తక్కువ సంఖ్యలో తెల్లని మచ్చలు ఏర్పడితే, కొందరికి అధికంగా ఈ మచ్చలు కనిపిస్తాయి. చేతి వేళ్లకు చెందిన గోర్లపై ఇలా తెల్లని మచ్చలు లేదా గీతలు ఏర్పడడాన్ని లుకోనైకియా అంటారు. ఇది వాస్తవానికి అత్యంత సహజసిద్ధమైందిగా చెబుతారు. దీని గురించి అంత కంగారు పడాల్సిన అవసరం లేదని వైద్యులు అంటున్నారు. చేతి వేళ్ల గోర్లపై తెల్లని మచ్చలు ఏర్పడేందుకు అనేక కారణాలు ఉంటాయి. కొందరు నెయిల్ పెయింట్‌లను ఎక్కువగా వాడుతుంటారు. లేదా బ్యూటీ పార్లర్లలో గోర్లకు చికిత్స తీసుకుంటారు. ఇలా మహిళలు అధికంగా చేస్తారు. కనుక వారి గోర్లపై ఇలా తెల్లని మచ్చలు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వారు పాటించే బ్యూటీ టిప్స్‌లో ఉపయోగించే రసాయనాలు పడకపోతే ఇలా జరుగుతుంది.

**ఇన్‌ఫెక్షన్లు ఉంటే..**

చేతి వేళ్ల గోర్లకు దెబ్బలు తగిలినా, ఫంగస్ ఇన్‌ఫెక్షన్లు ఏర్పడినా అలా గోర్లపై తెల్లని మచ్చలు కనిపిస్తుంటాయి. కనుక మీకు దెబ్బలు తాకినా, గాయాలు అయినా లేదా ఇన్ ఫెక్షన్లు వచ్చినా అందుకు అనుగుణంగా చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో గోర్లపై ఉండే తెల్లని మచ్చలు సైతం వాటంతట అవే తొలగిపోతాయి. ఇక కొందరు మహిళలకు నెయిల్ పాలిష్‌లు పడవు. అలాంటి వారికి అలర్జీలు వస్తాయి. కనుక వారి గోర్లపై కూడా అప్పుడప్పుడు ఇలా తెల్లని మచ్చలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. అలాగే గుండె జబ్బులు ఉన్నవారికి, నోటి దుర్వాసన వస్తున్నవారికి, కిడ్నీలు ఫెయిల్ అయిన వారికి, సోరియాసిస్, ఎగ్జిమా, న్యుమోనియా వంటి వ్యాధులు ఉన్నవారికి కూడా చేతి వేళ్ల గోర్లపై తెల్లని మచ్చలు వస్తాయి.

**జింక్ లోపం ఉన్నా..**

కొన్ని సందర్భాల్లో మనం తినే ఆహారం ఫుడ్ పాయిజనింగ్ అవుతుంది. ఆర్సెనిక్ పాయిజనింగ్ గనక జరిగితే అప్పుడు కూడా ఇలాగే గోర్లపై తెల్లని మచ్చలు వస్తాయి. ఇక ఇవన్నీ కారణాలు కాకపోతే కచ్చితంగా జింక్ లోపించిందని అర్థం చేసుకోవాలి. జింక్ మన శరీరానికి కావల్సిన మినరల్స్‌లో ఒకటి. మన శరీరంలో జింక్ లోపం ఉన్నా లేదా జింక్ ను తగినంతగా తీసుకోకపోయినా ఇలా కొందరికి అప్పుడప్పుడు చేతి వేళ్ల గోర్లపై తెల్లని మచ్చలు వస్తుంటాయి. కనుక పైన చెప్పిన వ్యాధులు కారణాలు కాకపోతే అలాంటి వారు కచ్చితంగా జింక్ లోపం ఉందని గ్రహించాలి. వెంటనే జింక్ ఉండే ఆహారాలను తినాలి. జింక్ మనకు ఎక్కువగా చేపలు, రొయ్యలు, మటన్, కోడిగుడ్లు, పాలు, చీజ్, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, అవిసె గింజలు, చియా సీడ్స్, బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా వంటి వాటిలో లభిస్తుంది. కనుక వీటిని తీసుకుంటే జింక్ సరిగ్గా లభిస్తుంది. అప్పుడు గోర్లపై ఉండే తెల్లని మచ్చలు సైతం తొలగిపోతాయి. కనుక ఈ సమస్యకు సరైన కారణం దొరికితే కచ్చితంగా పరిష్కారం లభిస్తుంది.




# డయాబెటిస్ వారికి ఎంతో మేలు చేసే పండ్లు ఇవే!

ఈ రోజుల్లో చాలా మంది చిన్న వయసులోనే వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వాటిలో డయాబెటిస్ కూడా ఒకటి. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు డయాబెటిస్‌కు కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అయితే, డయాబెటిస్ ఉన్నవారు తరచుగా ఏం తినాలి, ఏవ తినకూడదు అనే దాని గురించి ఆందోళన చెందుతారు. అయితే, డయాబెటిస్ ఉన్న వారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ పండ్లు షుగర్ లెవెల్స్‌ను కంట్రోల్ చేస్తాయని చెబుతున్నారు.

**సిట్రస్ పండ్లు:**

నిమ్మకాయలు, నారింజ, చిలగడదుంప వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. సిట్రస్ పండ్లలో అనేక ఇతర పోషకాలు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. వీటిలో చక్కెర చాలా తక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వాటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అందువల్ల, డయాబెటిస్ ఉన్నవారు వాటిని వారి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు అంటున్నారు.

**రాస్ప్బెర్రీస్:**

రాస్ప్బెర్రీస్‌లో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అవి మన శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో కూడా సమృద్ధిగా ఉంటాయి. రాస్ప్బెర్రీస్‌ను ప్రతిరోజూ తినడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వాటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఇవి జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తాయని నిపుణులు అంటున్నారు.

**స్ట్రాబెర్రీలు:**

చాలా మంది కొంచెం తీపిగా, కొంచెం పుల్లగా ఉండే స్ట్రాబెర్రీలలో చక్కెర ఎక్కువగా ఉంటుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. 100 గ్రాముల స్ట్రాబెర్రీలలో 7 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు వాటిని నిస్సందేహంగా తినవచ్చని నిపుణులు అంటున్నారు.

**కివి:**


ఈ పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఇతర ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని కూడా ప్రోత్సహిస్తాయని నిపుణులు అంటున్నారు. 100 గ్రాముల కివి పండులో కేవలం 9 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది.

**అవకాడో:**

అవకాడోలో విటమిన్లు C, E, K, B ఉంటాయి. ఈ విటమిన్లు అనేక ఆరోగ్య సమస్యల నుండి రక్షించడంలో సహాయపడతాయి. వీటిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల బరువు తగ్గవచ్చని నిపుణులు అంటున్నారు. ఇది మీ రక్తంలో చక్కెరను కూడా నియంత్రిస్తుంది. సగం అవకాడోలో 0.66 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రతిరోజూ అవకాడో తినాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.

# ఊపిరితిత్తులను సహజంగా ఇలా క్లీన్ చేసుకోవచ్చు.!

మన శరీరంలో ఊపిరితిత్తులు అనేవి అతి ముఖ్యమైన అవయవాలలో ఒకటి. ప్రస్తుత జీవనశైలిలో ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే పెరిగిపోతున్న కాలుష్యం, స్మోకింగ్ వంటివి ఊపిరితిత్తులను నాశనం చేస్తున్నాయి. కాబట్టి, ఊపిరితిత్తులను శుభ్రం చేస్తే, వాటి సామర్థ్యం పెరుగుతుంది. ఊపిరితిత్తులను సహజంగా ఎలా క్లీన్ చేసుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం..



**ఊపిరితిత్తులను ఇలా క్లీన్ చేయవచ్చు.. తులసి**

తులసి ఊపిరితిత్తులను సహజంగా శుభ్రపరచడంలో సహాయపడుతుంది. తులసిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం కలిగించడానికి సహాయపడతాయి. దీనిని తేనె, అల్లంతో కలిపి క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల దగ్గు, జలుబు వంటి సమస్యలకు కూడా ఉపశమనం లభిస్తుంది.

**అల్లం**

అల్లం కూడా ఊపిరితిత్తులను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇందులో యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలున్నాయి. ఇవి శ్వాసనాళాల నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడతాయి. అల్లం.. పొటాషియం, మెగ్నీషియం, బీటా-కెరోటిన్, జింక్ వంటి అనేక విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటుంది. అల్లంలోని యాంటీఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శ్వాసకోశంలోని వాపును తగ్గించడంలో సహాయపడతాయి. క్రమం తప్పకుండా అల్లం నీరు తాగడం వల్ల ఊపిరితిత్తులు క్లీన్ అవుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

**పసుపు**

పసుపులో ఉండే కర్కుమిన్ అనే సమ్మేళనం వల్ల ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది మంటను తగ్గించి, శ్లేష్మం తొలగించడంలో సహాయపడుతుంది. పసుపు సహజంగా ఊపిరితిత్తులను శుభ్రపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడుతుంది. ఇది శరీరం నుండి విషపదార్థాలను బయటకు పంపడానికి సహాయపడుతుంది, ఇది ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తుంది. పసుపును మీరు ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీ ఊపిరితిత్తులు సహజంగా క్లీన్ అవుతాయని నిపుణులు అంటున్నారు.



# ఘనంగా అయ్యప్ప పడిపూజ

**నేటి సాక్షి, మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల రోడ్డు ప్రాంతంలో గురుస్వామి కొలిపాక రాజు – వనిత దంపతుల నివాసంలో శనివారం అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం అత్యంత ఘనంగా, ఆడంబరంగా జరిగింది. అయ్యప్ప ఆలయ అర్చకులు అశోక్ శర్మ నేతృత్వంలో గణపతి పూజ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజ, ఘంటాపూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి అయ్యప్పకు విశేష అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి, ప్రత్యేకంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివారి పవిత్రమైన 18 మెట్లకు దీపారాధన చేసి, ప్రతి మెట్టును వెలిగించి పూజించడం భక్తులను ఆధ్యాత్మిక ఉల్లాసంలో ముంచెత్తింది.

### భజనలు, వేటతుల్లి ఆటతో ముగిసిన ఉత్సవం

'పడిపూజా' కార్యక్రమాల అనంతరం అయ్యప్ప దీక్షాధారులు, మాలధారులు హరివిల్లులు పాడుతూ భజన సంకీర్తనలతో ప్రాంతమంతా 'స్వామియే శరణం అయ్యప్ప' నినాదాలతో మార్మోగింది. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన వేటతుల్లి ఆటను అయ్యప్ప భక్తులు అద్భుతంగా ఆడి, ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచారు. కార్యక్రమ ముగింపులో గురుస్వామి కొలిపాక.రాజు దంపతులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ మహోత్సవంలో గురుస్వాములు అంకతి భరత్ కుమార్, జిందం ప్రతాప్, ఉరేటి రంజిత్, అరె రమేష్, ఒడ్డెపెల్లి రవి, పుప్పాల రాజేష్, నరేందర్, మల్లేశం తదితర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# పదవి భార్యది.. ప్రచారం భర్తది.!

### ఎమ్మెల్యే సాక్షిగా అపుడే మొదలైన 'భర్త-పెత్తనం'!?

### మూల రాంపూర్‌లో 'లాస్య-రాజశేఖర్' సర్పంచ్‌గా ఏకగ్రీవం




**నేటి సాక్షి, కోరుట్ల :** కోరుట్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ 'పంచాయతీ' ఎన్నికల్లో తాము బలపరిచిన స్థానంలో బోణి కొట్టింది. ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 'కానుగంటి లాస్య రాజశేఖర్' సర్పంచ్‌గా ఏకగ్రీవ ఎన్నికయ్యారు.

### మగ మహారాజులదే రాజ్యం.!

ఈ పంచాయతీ ఎన్నికల్లో బిసిలకు 42% రిజర్వేషన్ లు కేటాయించాలని కొందరు కోర్టు మెట్లెక్కి విఫలమయ్యారు. కాగా..ఇదే క్రమంలో ఏళ్ల నుంచి మహిళలకు 33% రిజర్వేషన్‌లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. దరిద్రమేంటంటే.. రిజర్వేషన్లంటే.. పదవి దక్కేవరకే.. జస్ట్.. 'యూజ్ అండ్ త్రో'.. ఇది కాదనలేని సత్యం.! ఈ నేపథ్యంలో.. ఏ ఎన్నికలైనా మహిళాలకు కేటాయించిన 'రిజర్వేషన్'లో గెలుపొందే వరకు 'ఆమె'ను ముందుంచి ప్రచారం చేసుకుంటారు. ఆ తర్వాతా అంతే.! మీటింగ్‌లకు 'ఆమె'ను భర్తనో.. బ్రదర్ సో.. తండ్రో.. కొడుకులో.. తీసుకెళతారు 'నిశానికి'.. రబ్బరు బొమ్మలా 'కుర్చీ'లో కూర్చోబెట్టి.. 'తెరవెనుక' రాజకీయమంతా..ఆమె చేయాల్సిన 'పరిపాలనంతా' ..మన 'మగమహారాజు'లదే.! కాదనగలరా.? సరిగ్గా ఇదే క్రమంలో ఇప్పుడు ఈ 'పంచాయతీ' ఎన్నికల్లోనూ ఇదే 'ఆనవాయితీ' కంటిన్యూ అయ్యింది.!

### ఇక్కడే 'సూపర్ ట్విస్ట్'.!

ఇబ్రహీంపట్నం మండలం మూల రాంపూర్‌లో సర్పంచ్ పదవి 'ఏకగ్రీవమైంది'. ఇందులో 'ట్విస్ట్' ఏంటంటే.. ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికైంది మహిళా అభ్యర్థి 'లాస్య'.! కానీ.. రిజర్వేషన్ దుర్వినియోగానికి పరాకాష్టగా ఆమె భర్త రాజశేఖర్ గెలుపొందినట్టు 'సోషల్మీడియా'లో వైరల్ చేసుకుంటున్నారు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు. అదికూడా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ 'రాజశేఖర్'ను వెంటబెట్టుకుని వెళుతున్న ఓ 'ఫోటో'ను వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. తమ పార్టీ అభ్యర్థి 'కానుగంటి లాస్య రాజశేఖర్'ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మూల రాంపూర్ గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఎమ్మెల్యే మెసేజ్ ఒకటి మొబైల్ లలో తెగతిరిగేస్తున్న వైనంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అపుడే 'ఆమె'పై ..'అతగాడి' పెత్తనం మొదలైందా.? దానికి ఎమ్మెల్యేనే ప్రత్యక్ష సాక్షిగా ఉండడమా.? ఎలాగూ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది.. మరి 'ఆ-మహిళా సర్పంచ్'ను వెంట తీసుకుని వెళ్లొచ్చుగా అంటూ కామెంట్లు వినిపిస్తున్నాయి. ఇదేనా? సంజయ్.. ఓ శాసనసభ్యుడై ఉండి ఆయన సమక్షంలోనే 'ఆమె'కు ఇంత 'అగౌరవం' లభిస్తే.. రానున్న ఐదేళ్ల పదవీ కాలంలో 'ఆమె' రబ్బరు స్టాంపేనన్న చర్చలు జరుగుతున్నాయి.. 'పాపం..లాస్య.! ఏ తోట కాడుందో? వంటింట్లో ఉందో!?

# విజిలెన్స్ అధికారి 'కాసేపు మాయం'!?

- కార్యాలయంలో ముమ్మర తనిఖీల టైంలో వచ్చిన ఫోన్ ఎవరిది?
- గేట్ ముందుకొచ్చిన ఆ 'వైట్ కలర్ క్రెట్టా కారు' ఎవరిది.?
- ఆకస్మిక తనిఖీలు వదిలి వెళ్లాల్సిన అంత ఏం అవసరమొచ్చింది.?
- వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు ఓ కారు.. తిరిగి వచ్చేటప్పుడు మరో కారు?
- అసలేం జరిగి ఉంటుందని కోరుట్లలో చర్చ



**కోరుట్ల మున్సిపల్‌లో అధికారుల అవినీతి తారాస్థాయికి చేరిందని..బాధితులెందరో ఉన్నతాధికారులకు కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు చేయడంతో వారు స్పందించినట్టున్నారు. అందుకే 'విజిలెన్స్ అధికారులను' తనిఖీలు చేపట్టి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని వచ్చిన ఆదేశాలు.. కోరుట్ల'కొచ్చేసరికి గాల్లో కలిసినట్టున్నాయి.కార్యాలయం నుంచి అధికారులెవరూ.. బయటికి వెళ్లొద్దని ఆదేశించిన 'ఆ-అధికారే' అర్ధాంతరంగా ఓ రెండు గంటలపాటు 'మాయమైపోవడం' స్థానికంగా చర్చనీయాంశమైంది.**

**- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**

### ఇంతకీ.. ఆ 'వైట్ కలర్ క్రెట్టా కారు' ఎవరిదో?

శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు కరీంనగర్ నుండి హైదరాబాద్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోరుట్ల మున్సిపల్‌కు వచ్చిన 'విజిలెన్స్' అధికారులు.. వచ్చిన పని మరిచి 'సొంత పనుల'కోసం బయటకు వెళ్లడంపై అనుమానాలకు తావిస్తోంది.తనిఖీలు ముమ్మరంగా సాగుతోన్న సమయంలో 'ఎవరిదో' ఫోన్ కాల్ వస్తే.. మధ్యాహ్నం 12:30 గంటలకు మున్సిపల్ గేటు ముందుకు ఓ 'వైట్ కలర్ క్రెట్టా కారు' వచ్చి ఆగింది.ఆ అధికారిని 'పికప్' చేసుకుని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుందని విశ్వసనీయ సమాచారం.అక్కడ కోరుట్ల పట్టణానికి చెందిన 'ప్రముఖ వ్యాపారి'తో ఓ రెండు గంటలపాటు గడిపి మరో కారులో.. మళ్లీ మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి 'తూతూ-మంత్రంగా' తనిఖీలు నిర్వహించి వెళ్లిపోయినట్టు సమాచారం.

### ఇంతకీ 'సార్ వారు' ఎందుకెళ్లినట్టో?

ఈ ఉదంతంలో 'అన్నీ ప్రశ్నలే'! ఏ అధికార బృందమైనా.. 'తనిఖీ'ల కోసం వచ్చినపుడు మధ్యలో ఎక్కడికీ వెళ్లకూడదు. అలా వెళితే.. ఆ వెళ్లిన అధికారిని ఎవరైనా ప్రభావితం చేసే అవకాశం ఉంటుందని చర్చించుకుంటున్నారు. మరి అతను తన వెంట వచ్చిన ఇతర అధికారులకు 'తనిఖీల' బాధ్యతలు అప్పగించి తను ఎక్కడికి వెళ్లాడు.? 'లంచ్'కై ఉంటుందా.? లేదే దానికి బయటకెందుకు.? కార్యాలయ అధికారులు తెప్పిస్తే బావుండదు కాబట్టి..మున్సిపల్ ఆవరణలోనే 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్' ఉంది 'స్నాక్స్' ఏవో తినొచ్చు.! లేదా బయట ఉన్న ఇంకేదైనా 'రెస్టారెంట్'కు వెళ్లొచ్చు.. అలా వెళ్లాలనుకున్నా 'విజిలెన్స్-టీం' అంతా వెళ్లాలి.? కానీ..ఒక్కరే ఎందుకు వెళ్లారు.? ఓకే.! 'లంచ్'కే వెళ్లారనుకుంటే 'వెంకటేశ్వర ఆలయం' వైపు అసలేం ఉండవుగా.? ఇక్కడ ఎవరికీ 'డౌట్' అనేది రాకపోవుగానీ..ఆయనను 'పికప్' చేసుకోవడానికి వచ్చిన 'వైట్ కలర్ క్రెట్టా కారు' ఓ ప్రముఖ వ్యాపారిది కావడం వల్లే ఈ అనుమానాలన్నీ.! అతను 'ఇప్పటికే-కోట్ల రూపాయల' ప్రభుత్వ సొమ్ము నొక్కి దర్జాగా 'రాజకీయ నేతల్నీ'..'ప్రభుత్వ అధికారులను'.. 'వ్యాపార వర్గాలను'.. అంతెందుకు ఆఖరికి 'పాత్రికేయులనూ..' కొనేసి 'కట్టప్ప'లను చేసుకుని వెంట తిప్పుకుంటున్న 'రింగ్ లీడర్' వాహనంలో వెళ్లడం వెనుక 'మతలబేదో' ఉందని కోరుట్ల ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు.! ఇలాంటి 'సైడ్ విజిటింగ్-విజిలెన్స్ అధికారుల' తనిఖీల నివేదిక వల్ల ముదిరిపోయిన మున్సిపల్ అధికారుల పీడ వదిలించగలదా.? బాధిత ప్రజల 'ఫిర్యాదులకు' ఇక న్యాయం జరిగినట్టేనని పెదవివిరుస్తున్నారు!

# ఇంతకూ ఈ 'ఏకగ్రీవ సర్పంచ్' ఎవరి పార్టీ!?



**తొలుత 'ఎమ్మెల్యే సంజయ్' తన వెంట ఉన్న ఫోటోతో 'బిఆర్ఎస్ బోణీ' అని వైరల్**

**రాత్రి వరకు 'జువ్వాడి నర్సింగరావు'కు కృతజ్ఞతలు అని సోషల్ మీడియాలో మరో మెసేజ్ చక్కర్లు**


**'ఏకగ్రీవ సర్పంచ్' కాసుగంటి లాస్య-రాజశేఖర్‌ది ఏ పార్టీ?**




**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** 'కూర కమ్మగా కుదిరితే నేనే వండినాని కోడలు..మాడిపోతే మా అత్త వండిందని..' నిందవేసే రోజులివి.! సరిగ్గా ఇలానే ఉంది ఈ 'ఏకగ్రీవ సర్పంచ్' ఉదంతం. 'పంచాయతీ' ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మండలం మూల రాంపూర్ గ్రామ సర్పంచ్ గా 'కాసుగంటి.లాస్య రాజశేఖర్' ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అయితే.! తొలుత కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తన వెంట రాజశేఖర్ పక్కన ఉన్న ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.కోరుట్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బోణీ కొట్టిందని.!

### రాత్రి కాంగ్రెస్ ప్రచారంలో మావాడంటూ మెసేజ్.!

పొద్దంతా బిఆర్ఎస్ పార్టీ 'బోణీ' కొట్టామని ప్రచారం చేసుకోగా.. రాత్రయ్యే సరికి ఇదే 'కాసుగంటి.లాస్య రాజశేఖర్' తనను కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు సూచిస్తేనే నామినేషన్ దాఖలు చేసినట్టు మరో మెసేజ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇంతకూ.. 'కాసుగంటి లాస్య రాజశేఖర్'ది ఏ పార్టీ నో!? అని కోరుట్ల నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.









# 9 ప్రపంచ రికార్డుల ముంగిట కోహ్లి



క్రికెట్ ప్రపంచంలో కింగ్ కోహ్లీగా ప్రఖ్యాతి గాంచిన విరాట్ కోహ్లీకి నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న మూడు వన్డే మ్యాచ్‌ల సౌతాఫ్రికా సిరీస్ చాలా కీలకం కానుంది. ఇది కోహ్లీకి కేవలం ఒక సాధారణ సిరీస్ కాదు, ఏకంగా తొమ్మిదికి పైగా అరుదైన ప్రపంచ రికార్డులను తన ఖాతాలో వేసుకునే అద్భుతమైన అవకాశం. అత్యంత వేగంగా 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేయడం నుంచి, ఒకే ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించడం వరకు... ఈ సిరీస్‌లో విరాట్ కొట్టే ప్రతి పరుగు చరిత్ర సృష్టించనుంది. విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో 51 సెంచరీలతో, టెస్టుల్లో 51 సెంచరీలు సాధించిన సచిన్ టెండూల్కర్ రికార్డుతో సమంగా ఉన్నాడు. ఈ సిరీస్‌లో విరాట్ కేవలం ఒక్క సెంచరీ సాధిస్తే, వన్డేల్లో 52 సెంచరీలు పూర్తి చేసుకుంటాడు. తద్వారా అతను ఏ ఒక్క ఫార్మాట్‌లో అయినా అత్యధిక సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మెన్‌గా నిలిచి, సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తాడు. ఈ అరుదైన రికార్డు కోసం యావత్ క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగంగా పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కూడా కోహ్లీ ముందున్నాడు. విరాట్ 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేయడానికి 327 పరుగులు మాత్రమే అవసరం. రాబోయే 23 ఇన్నింగ్స్‌లలో విరాట్ ఈ పరుగులు చేస్తే, అత్యంత వేగంగా 28,000 పరుగులు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశం ఉంది. అలాగే, ప్రస్తుతం విరాట్ ఖాతాలో 27,673 అంతర్జాతీయ పరుగులు ఉన్నాయి. అతను కేవలం 344 పరుగులు చేస్తే, శ్రీలంక దిగ్గజం కుమార సంగాక్కర (28,016 పరుగులు)ను అధిగమించి, సచిన్ టెండూల్కర్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన రెండవ బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. ఈ సిరీస్‌లో విరాట్ సౌతాఫ్రికాపై, భారత గడ్డపై కూడా అనేక ప్రత్యేక రికార్డులు సాధించే అవకాశం ఉంది. కేవలం ఒక సెంచరీ సాధిస్తే, సౌతాఫ్రికాపై 6 వన్డే సెంచరీలు చేసిన ప్రపంచంలోనే ఏకైక బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. అలాగే, గెలిచిన మ్యాచ్‌లలో మరో 14 పరుగులు చేస్తే, సౌతాఫ్రికాపై భారత్ విజయాలలో 1000 వన్డే పరుగులు చేసిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టిస్తాడు. SENA (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలపై గెలిచిన వన్డే మ్యాచ్‌లలో అత్యధిక పరుగులు చేసిన ప్రపంచ రికార్డుకు కేవలం 16 పరుగులు దూరంలో మాత్రమే ఉన్నాడు. స్వదేశంలో ఒక 50ం స్కోరు సాధిస్తే, భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక 50ం స్కోర్లు చేసిన రికార్డును సొంతం చేసుకుంటాడు. అంతేకాకుండా, ఒక హాఫ్ శతకం సాధిస్తే, దేశీయ మైదానాల్లో 100 హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్న ఏకైక ఆటగాడిగా అరుదైన మైలురాయిని చేరుకుంటాడు.

# ఆయుష్ మాత్రే సిక్సర్ల వర్షం



2025-26 సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ 2025-26) లో భాగంగా జరిగిన ఎలైట్ గ్రూప్ %ూ% మ్యాచ్‌లో విదర్భ, ముంబై జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ముంబై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ టీ20 మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై కేవలం 17.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ముంబై తరపున అద్వితీయ సెంచరీ చేసిన ఆయుష్ మాత్రే ఈ విజయానికి ప్రధాన రూపశిల్పి అయ్యాడు. మ్యాచ్ ప్రారంభంలో, టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ తొలి వికెట్‌కు 115 పరుగులు జోడించడం ద్వారా మంచి ఆరంభాన్ని ఇచ్చింది. అథర్వ టైడే 64 పరుగులు, అమన్ మొఖడే 61 పరుగులు సాధించారు. అయితే, ఈ ఇద్దరు ఆటగాళ్లు అవుట్ అయిన తర్వాత ఆరుగురు బ్యాట్స్‌మెన్ రెండంకెల స్కోరును చేరుకోకపోవడంతో విదర్భ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఒకప్పుడు 200 కంటే ఎక్కువ స్కోరు చేసిన విదర్భ చివరికి 192 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ భారీ స్కోరును ఛేదించే క్రమంలో, 18 ఏళ్ల ఆయుష్ మాత్రే ముంబై తరపున చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఆయుష్ మాత్రే కేవలం 53 బంతుల్లోనే అజేయంగా 110 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో, ఆయుష్ మాత్రే 8 ఫోర్లు, 8 సిక్సర్లు బాదాడు. అతను కేవలం ఫోర్ల ద్వారా 80 పరుగులు చేశాడు. ఆయుష్ మాత్రేతో పాటు సూర్యకుమార్ యాదవ్ కూడా 30 బంతుల్లో 35 పరుగులు చేశాడు. అదే సమయంలో, శివమ్ దూబే 19 బంతుల్లో 205.26 స్ట్రైక్ రేట్‌తో అజేయంగా 39 పరుగులు చేసి జట్టును విజయపథంలో నడిపించాడు. శివమ్ దూబే కూడా 3 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు. ఫలితంగా, ముంబై కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించింది.

# నేడు భారత్, దక్షిణాఫ్రికా తొలి వన్డే

## రాంచీ వేదికగా జరగనున్న మొదటి మ్యాచ్

## వన్డే సిరీస్‌లో సత్తా చాటాలని భావిస్తోన్న భారత్





రాంచీ: టెస్ట్ సిరీస్‌లో ఘోరంగా ఓడిపోయి దాదాపు అయిదారు దశాబ్దాల చెత్త రికార్డులను ఖాతాలో వేసుకున్న టీమిండియా వన్డే సిరీస్‌లో సత్తా చాటాలని భావిస్తోంది. ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతం గంభీర్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్ కోసం రెండు జట్లు సిద్ధంగా ఉన్నాయి. వన్డే సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ నవంబర్ 30, 2025న రాంచీ వేదికలో భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. టెస్ట్ సిరీస్ ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందని క్రికెట్ ప్రేమికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అందుకు కారణంగా దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి పెద్ద ఆటగాళ్ళు జట్టులో ఉన్నారు. కనుక వన్డే సిరీస్ కోసం అభిమానులు చూస్తున్నారు. పటిష్ట టీమిండియా వన్డే సిరీస్ లో సఫారీలపై నెగ్గుతారని సంకేతాలు కనిపిస్తున్నాయి. భారత్, దక్షిణాఫ్రికా మధ్య మొదటి వన్డే రాంచీలో స్టేడియం కాంప్లెక్స్‌లో ఆదివారం నాడు జరగనుంది. అయితే స్టేడియానికి వెళ్లి చూడలేని వారు హాయిగా ఇంట్లో కూర్చుని లైవ్ స్ట్రీమింగ్, టీవీ ప్రసార ఆప్షన్లు ఉన్నాయి. వాటి గురించి క్రికెట్ అభిమానులు తెలుసుకోవాలి. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో రాణించిన సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నారు. దీంతో అభిమానుల చూపులన్నీ వాళ్లపైనే ఉండనున్నాయి. ఈ ఇద్దరూ బ్యాటింగ్‌లో రాణిస్తే, జట్టుకు భారీ స్కోర్ ఖాయం. సౌతాఫ్రికాపై విరాట్ గత రికార్డులు బాగుండడం, రోహిత్ శర్మ భీకర ఫామ్‌లో ఉండడం భారత్‌కు కలిసొచ్చే అంశాలు. ఇక రెగ్యులర్ కెప్టెన్ శుభమన్ గిల్, శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా దూరమయ్యారు. మహమ్మద్ షమి, బుమ్రా, సిరాజ్ లాంటి సీనియర్ పేసర్లలో ఒక్కరూ లేకుండా ఒక పెద్ద జట్టుతో భారత్ వన్డే సిరీస్ ఆడుతుండడం చాలా ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న సౌతాఫ్రికాను భారత యువ పేసర్లు ఏ మేరకు కట్టడి చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. కెప్టెన్ గిల్ గైర్హాజరులో సీనియర్ ఆటగాడు KL రాహుల్ జట్టును నడిపించనున్నాడు. రోహిత్‌కుతో యశస్వీ జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. తర్వాత విరాట్ రానున్నాడు. తిలక్ వర్మ, రిషభ్ పంత్, KL రాహుల్‌తో పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ ఉంది. మరో సీనియర్ రవీంద్ర జడేజాకు తుది జట్టులో చోటు ఖాయం కాగా, అతడికి తోడు మరో ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్ సుందర్ లేదా నితీశ్ కుమార్ రెడ్డిని ఎంచుకునే అవకాశం ఉంది. వన్డేలేలో కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ రికార్డ్ మెరుగ్గానే ఉంది. ఇప్పటిదాకా 12 మ్యాచ్‌ల్లో టీమ్‌ఇండియాకు రాహుల్ నాయకత్వం వహించాడు. అందులో 8 వన్డేల్లో భారత్ గెలిచింది. మరో నాలుగింట్లో ఓడింది. ఓవరాల్‌గా విన్నింగ్ పర్సెంటేజీ 67 శాతంగా ఉంది.

సీనియర్లకు లేకపోవడంతో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణకు తొలి వన్డేలో ఛాన్స్ దక్కే ఛాన్స్ ఉంది. మరి ఈ యువ ఆటగాళ్లు అనుభవజ్ఞులైన సఫారీ బ్యాటర్లకు ఎలా కళ్లెం వేస్తారో చూడాలి. ఒకరకంగా చెప్పాలంటే ఈ పేస్ త్రయానికి మాత్రం సౌతాఫ్రికా సిరీస్ కఠిన పరీక్ష కానుంది. టెస్టు సిరీస్ గెలిచిన ఉత్సాహంలో ఉన్న సఫారీలు వన్డే సిరీస్‌లోనూ సత్తాచాటాలని పట్టుదలతో ఉన్నారు. కెప్టెన్ బవుమా, మార్‌క్రమ్, రికిల్‌టన్, డికాక్, డేవిడ్ బ్రెవిస్, బ్రీట్జ్‌కేలతో బ్యాటింగ్ విభాగం దుర్భేద్యంగా కనిపిస్తోంది. కార్బిన్ బాష్, మార్కో యాన్సెన్ వంటి నాణ్యమైన ఆల్‌రౌండర్లు ఉండగా స్పిన్ భారం కేశవ్ మహారాజ్ మోయనున్నాడు. స్టార్ పేసర్లు రబాడా, నోకియా దూరమైన నేపథ్యంలో ఎంగిడి నేతృత్వంలోని బౌలింగ్ దళం ఎంతమేర రాణిస్తోందో చూడాలి. నెమ్మదిగా ఉండే రాంచీ పిచ్‌పై భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం లేదు. టాస్ గెలిచిన జట్టు తొలుత బౌలింగ్ తీసుకునే అవకాశం ఉంది. కాగా టీమిండియా, దక్షిణాఫ్రికా మధ్య రాంచీ వేదికగా జరగనున్న మొదటి వన్డే మ్యాచ్ జియోహాట్‌స్టార్ యాప్, జియో హాట్‌స్టార్ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షంగా ప్రసారం చేయనున్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఎప్పటిలాగే, మ్యాచ్‌ని చూడటానికి అభిమానులు జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ కలిగి ఉండాలి. టీవీలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ చూడాలనుకునే వారు స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో మ్యాచ్ లైవ్ చూడవచ్చు. టాస్ ఆట ప్రారంభానికి 30 నిమిషాల ముందు, అంటే మధ్యాహ్నం 1:00 గంటలకు వేస్తారు. టాస్ తర్వాత భారత్, దక్షిణాఫ్రికా జట్ల ప్లేయింగ్ %శ×% ప్రకటిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు డే అండ్ నైట్ వన్డే ప్రారంభం కానుంది. వాస్తవానికి భారత్‌లో సిరీస్ కనుక ఉదయం వేళ నుంచి సాయంత్రం వరకు మ్యాచ్ ఉంటుందని ఆశించిన ఫ్యాన్సుకు నిరాశే ఎదురవుతోంది.

**భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్: పూర్తి స్క్వాడ్‌లు**

భారత్ పూర్తి ఆటగాళ్లు- రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ (కెప్టెన్), తిలక్ వర్మ, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, రుతురాజ్ గైక్వాడ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ధ్రువ్ జురెల్

దక్షిణాఫ్రికా పూర్తి ఆటగాళ్లు - టెంబా బావుమా (కెప్టెన్), ఓట్నీల్ బార్ట్‌మన్, మాథ్యూ బ్రీట్జ్‌కే, ర్యాన్ రికెల్టన్, ఐడెన్ మార్క్రమ్, కార్బిన్ బోష్, డెవాల్డ్ బ్రెవిస్, నాండ్రే బర్గర్, క్వింటన్ డి కాక్, రూబిన్ హెర్మన్, కేశవ్ మహారాజ్, టోనీ డి జోర్జీ, మార్కో జాన్సెన్, లుంగి ఎంగిడి, ప్రెనెలాన్ సుబ్రాయెన్

# టీమిండియాలో ద్రవిడ్, లక్ష్మణ్‌లాంటి బ్యాటర్లు లేరు



**క్రీజులో పాతుకుపోయి ఓపికగా ఆడే నైపుణ్యం లేదు**

**క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు**

ప్రస్తుత భారత జట్టులో రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్‌లాంటి స్పెషలిస్ట్ టెస్ట్ బ్యాటర్లు లేరని క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ అన్నాడు. టీ20, వన్డేలు ఎక్కువగా ఆడటంతో క్రీజులో పాతుకుపోయి ఓపికగా ఆడే నైపుణ్యం భారత బ్యాటర్లకు లేకుండా పోయిందని అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయిన సంగతి తెలిసిందే. ఈ ఘోర పరాజయంతో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో భారత్ జట్టు సంధి దశలో ఉంది. తాజాగా భారత జట్టు ప్రదర్శనపై స్పందించిన కపిల్ దేవ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.'ప్రస్తుతం భారత ఆటగాళ్లు ఎక్కువగా టీ20లు, వన్డే మ్యాచ్‌లు ఆడుతున్నారు. దాంతో బ్యాటర్లకు బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై ఆడే అవకాశం రావడం లేదు. స్పిన్, పేస్‌కు అనుకూలించే పిచ్‌లపై బ్యాటర్లు చాలా ఓపికగా ఆడాలి. అలాగే ప్రత్యేకమైన నైపుణ్యం కలిగి ఉండాలి. ప్రస్తుతం మన దగ్గర క్రీజులో పాతుకుపోయే రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ వంటి స్పెషలిస్ట్ బ్యాటర్లు లేరు. టెస్ట్‌ల్లో బ్యాటింగ్ అంటే క్రీజులో పాతుకుపోవడమే. స్పిన్, పేస్‌ను సమర్థవంతంగా ఎదు-ర్కోవాలంటే ప్రత్యేకమైన నైపుణ్యం ఉండాలి. కానీ టర్న్, బౌన్స్ ఎక్కువగా ఉండే పిచ్‌లపై బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదు. ఈ తరహా పిచ్‌లపై ఫుట్‌వర్క్ చాలా కీలకం. కానీ రిషభ్ పంత్ శైలి వేరు. ఎందుకంటే దూకుడుగా ఆడటమే అతని స్టైల్. రిషభ్ పంత్‌ను డిఫెన్స్ ఆడమని మనం చెప్పలేం. ఎందుకంటే పంత్ సిక్స్‌లు, ఫోర్లతో ఎదురువిరుచుకుపడి, ప్రత్యర్థి జట్టును కకావికలం చేయగల సమర్థుడు. అలాంటి నైపుణ్యమున్న అతనికి మనం నెమ్మదిగా ఆడి 100 బంతుల్లో 20 పరుగులు చేయమని చెప్పలేం. అతను అలా చేయలేడు కూడా'అని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు.

# స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసిన ముంబై ఇండియన్స్

## మహిళా ప్రీమియర్ లీగ్ కోసం భారీ కసరత్తు

రెండుసార్లు మహిళా ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్, మహిళా ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం ఒక స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసింది. వేలానికి ముందు ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న ముంబై ఇండియన్స్, వేలంలో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ అమెలియా కెర్ కోసం ఏకంగా రూ.3 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించింది. పాత ఆటగాళ్లైన షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజన సజీవన్ మళ్లీ జట్టులోకి రావడంతో ముంబై జట్టు మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యజమాని నీతా అంబానీ, తాము గతేడాది జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నవంబర్ 27) జరిగిన మహిళా ప్రీమియర్ లీగ్ వేలం గురించి మాట్లాడిన ముంబై ఇండియన్స్ సహ-యజమాని నీతా అంబానీ, వేలం రోజు చాలా ఉత్సాహంగా, కొన్నిసార్లు టెన్షన్‌గా కూడా గడిచిందని అన్నారు. 2025లో ఛాంపియన్‌గా నిలిచిన జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయడమే తమ ప్రధాన వ్యూహమని ఆమె వెల్లడించారు. కీలకమైన ఆటగాళ్లు తిరిగి జట్టులోకి రావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వేలంలో అమెలియా కెర్ తిరిగి జట్టులోకి రావడం అలాగే షబ్నిమ్ ఇస్మాయిల్, సైకా ఇషాక్, సజన సజీవన్, సంస్కృతి గుప్తా వంటి నలుగురు భారతీయ ప్లేయర్లు మళ్లీ రావడం ముంబై ఇండియన్స్‌కు పెద్ద బలం అని ఆమె అన్నారు. అంతేకాకుండా రాహిలా ఫిర్దౌస్, నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ వంటి యువ ప్రతిభావంతులతో పాటు, పూనమ్ ఖేమ్నార్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్, నికోలా కేరీలను కూడా ముంబై ఇండియన్స్ ఫ్యామిలీలోకి స్వాగతించారు. ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు, నాట్ సైవర్-బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి కమలిని వంటి ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. వేలంలో ఇటీవల టీ20 ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన అమెలియా కెర్, ఫాస్ట్ బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ తిరిగి రావడం కోర్ టీమ్‌ను మరింత పటిష్టం చేసింది. ప్రపంచ కప్ విజేత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా న్యూఢిల్లీలో జరిగిన వేలానికి హాజరై, వేలం టేబుల్‌పై వ్యూహాలను రచించడంలో కీలక పాత్ర పోషించారు. వేలంలో తన అనుభవం గురించి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. “నేను మొదట్లో కొంచెం కంగారు పడ్డాను, కానీ మేము ప్రణాళిక చేసిన విధానం, అందరి భాగస్వామ్యం నాకు చాలా బాగా నచ్చింది. నీతా అంబానీ ఎప్పుడూ జట్టుకు సపోర్టుగా ఉండి మాకు అండగా నిలుస్తారు. మా పాత సహచరులలో ఎక్కువ మందిని మేము తిరిగి పొందాము. ఇది ఆ ఆటగాళ్లపై జట్టుకు ఉన్న నమ్మకాన్ని చూపుతుంది” అని అన్నారు. ముంబై ఇండియన్స్ విజయాలలో సైకా, సజన, సంస్కృతి వంటి ఇండియన్ ప్లేయర్లు కీలక పాత్ర పోషించారు. వారు టోర్నమెంట్‌లో ఎదుగుతున్న స్టార్ ప్లేయర్‌లుగా నిలిచారు. ముంబై ఇండియన్స్ జట్టు.. అనేక ప్రపంచ కప్‌ల విజేత అయిన నికోలా కేరీ, యువ ఫాస్ట్ బౌలర్ మిల్లీ ఇల్లింగ్‌వర్త్ అనే ఆస్ట్రేలియన్ జోడీని కూడా తమ జట్టులో చేర్చుకుంది. అలాగే యంగ్ ఇండియన్ టాలెంటుకు సపోర్ట్ ఇచ్చే తమ విధానానికి అనుగుణంగా, భారతీయ ఆల్‌రౌండర్‌లు నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ్‌లను కూడా కొనుగోలు చేసింది. వీరిద్దరూ తొలిసారి డబ్ల్యూపీఎల్ లో ఆడనున్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737
కరీంనగర్ | ఆదివారం 30 నవంబర్ 2025




# ఓటిటి వేదికగా శివ విడుదల చేస్తాం: నాగ్

ఒకప్పటి కల్ట్ క్లాసిక్ 'శివ' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మరోసారి సందడి చేసిన క్రమంలో.. ఇప్పుడీ చిత్రాన్ని ఓటీటీలోకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నాగార్జున చెప్పారు. తాజాగా గోవా వేదికగా జరిగిన ఇఫి వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'శివ' గురించి, ఏయన్నార్ చిత్రాల గురించి మాట్లాడారు. శివ' రీరిలీజ్ వెర్షన్ ఓటీటీలో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి . ఇప్పటికే పలు సంస్థలతో చర్చలు జరిపాం. ఎంతో కష్టపడి దీన్ని 4కే వెర్షన్‌లోకి మార్చాం. అందరూ చూసి ఎంజాయ్ చేయాలనే తపనతోనే ఓటీటీలో విడుదల చేయాలని అనుకుంటున్నాం. ఇప్పుడు గొప్ప టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. సినిమాలను 4కే లోకి ఎలా మార్చాలో అర్థమైంది. ఏఐ వచ్చిన తర్వాత ప్రతి పని సులభమైంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో మంచి సాంకేతికత అందుబాటులో ఉందని చెప్పారు. ఏయన్నార్ అలనాటి అనేక అపూర్వ సినిమాలను 4కే వెర్షన్‌లోకి మార్చాలంటే నెగెటివ్స్ లేవని చెప్పారు. అధునాతన సాంకేతిక హంగులతో ఏయన్నార్ పాత చిత్రాలను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఉన్నా.. రైట్స్, నెగెటివ్స్ లేకపోవడంతో సాధ్యం కావట్లేదని నాగార్జున తెలిపారు. తన 100వ చిత్రం నుంచి కూడా త్వరలోనే అప్‌డేట్స్ వస్తాయని తెలిపారు. అలాగే అఖిల్ తదుపరి చిత్రం 'లెనిన్' పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.



## ప్రభాస్ లుక్ కనిపించకుండా వంగా జాగ్రత్తలు

### ఆరు నెలలపాటు పబ్లిక్ ఈవెంట్‌లకు దూరంగా రెబల్



ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న మోస్ట్-అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'స్పిరిట్' గురించి ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల మొదలవ్వగా, దర్శకుడు సందీప్ వంగా ప్రభాస్ లుక్ విషయంలో అత్యంత గోప్యత పాటిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' సినిమాలోని ప్రభాస్ పాత్ర లుక్‌ను అభిమానులకు సర్‌ప్రైజ్‌గా ఉంచాలని సందీప్ వంగా గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే, ఈ లుక్ లీక్ అవ్వకుండా ఉండేందుకు, రాబోయే ఆరు నెలల పాటు ప్రభాస్‌ని పబ్లిక్ ఈవెంట్స్‌కు దూరంగా ఉండాలని కోరినట్లు సమాచారం. పబ్లిక్ ఈవెంట్లు, ఎయిర్‌పోర్ట్‌లలో ప్రభాస్ కనిపిస్తే, ఆయన లుక్‌ను అభిమానులు లేదా మీడియా ఫోటోలు తీసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, కొన్ని నెలల పాటు ఎలాంటి ప్రచార కార్యకలాపాలు లేదా బహిరంగ కార్యక్రమాలకు హాజరు కాకూడదని ప్రభాస్, సందీప్ వంగా నిర్ణయించుకున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినా సందీప్ వంగా ప్రభాస్‌ను ఏ విధంగా ప్రెజెంట్ చేయబోతున్నారో చూడాలనే ఉత్సాహం మాత్రం వారిలో ఎక్కువగా ఉంది. 'స్పిరిట్' చిత్రంలో త్రిప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్, కాంచన ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.




## వారణాసి టైటిల్ సమస్య ఎదుర్కొంటోందా?

ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. 2027లో రాబోతున్న ఈ సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించినప్పటి నుంచి సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా 'వారణాసి' అనే టైటిల్‌ను తెలుగులో గతంలోనే వేరే నిర్మాణ సంస్థ రిజిస్టర్ చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజాగా ఈ టైటిల్ వివాదం పరిష్కారమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేరే నిర్మాణ సంస్థ కేవలం తెలుగులో మాత్రమే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకోవడంతో, చిత్ర బృందం తెలుగు వెర్షన్ టైటిల్‌లో స్వల్ప మార్పు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ సినిమా పలు భాషల్లో విడుదల కానున్నందున, తెలుగులో మాత్రం 'రాజమౌళి వారణాసి' అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇతర అన్ని భాషల్లో మాత్రం 'వారణాసి' అనే ఒరిజినల్ టైటిల్‌నే కొనసాగించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై చిత్ర యూనిట్ త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ఖలేజా సినిమా టైంలో కూడా ఇలా టైటిల్ వివాదం ఎదుర్కోగా.. మేకర్స్ ఆలోచించి మహేశ్ ఖలేజా అనే పేరుతో విడుదల చేయగా.. వివాదం సద్దుమణిగింది.

## స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా?


ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమె ఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## అప్పులు తీర్చిన ఆపద్బాంధవుడు శ్రీవిష్ణు

### దర్శకుడు వేణు వుడుగుల ఎమోషన్



తెలంగాణ నేపథ్యంలో వాస్తవిక అంశాలతో కూడిన సినిమాలు తీసే దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వారిలలో వేణు వుడుగుల ఒకరు. నీది నాది ఒకే కథ(2018), విరాట పర్వం ఇలా తీసింది రెండు చిత్రాలే అయిన మంచి దర్శకుడిగా స్థానాన్ని నిలుపుకున్నాడు. తాజాగా అతడి నిర్మాణంలో వచ్చిన చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం సూపర్‌హిట్‌ను అందుకుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ.. తన మొదటి సినిమా హీరో శ్రీవిష్ణు చేసిన సహాయాన్ని గుర్తు చేసుకుని ఇటీవల భావోద్వేగానికి లోనయ్యారు. శ్రీవిష్ణు కథానాయకుడిగా వేణు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'నీది నాది ఒకే కథ' (2018). ఈ సినిమా సమయంలో తన ఆర్థిక ఇబ్బందుల గురించి వేణు తాజాగా మాట్లాడుతూ.. నా మొదటి సినిమా ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు, నేను కొన్ని తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాను. అప్పులు చాలా ఉండేవి. ఒకరోజు నన్ను శ్రీవిష్ణు చూసి ఎందుకు మీరు ఇలా ఉంటారు ఎప్పుడు ఏదో బాధతో అని అడిగాడు. ఏమైన అప్పులు ఉన్నాయా అంటూ తెలుసుకున్నాడు. నేను కూడా చిన్న చిన్నవే అంటూ చెప్పాను. దీంతో నా పరిస్థితి తెలుసుకున్న శ్రీ విష్ణు ఆ మరుసటిరోజే నాకున్న అప్పులన్నీ తీర్చేశాడు. ఆయనకు ఏం అవసరం ఇది చేయడానికి.. అయిన కూడా చేశాడు. ఆరోజు శ్రీవిష్ణు చేసిన సహాయాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన నా సినిమాకు కేవలం హీరో మాత్రమే కాదు, నా కష్టకాలంలో నాకు అండగా నిలబడిన ఒక దైవంగా భావిస్తాను అంటూ వేణు చెప్పుకొచ్చాడు.



## దుమ్మురేపుతున్న .. పేరుగల్ల పెద్దిరెడ్డి ఫోక్ సాంగ్

తెలంగాణ జానపద గాయని, నృత్యకారిణి నాగదుర్గ నుంచి తాజాగా విడుదలైన పాట 'పేరుగల్ల పెద్దిరెడ్డి' ప్రస్తుతం యూట్యూబ్‌లో మరియు సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది. తెలంగాణ ఫోక్ సాంగ్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ, ఈ కొత్త పాటతో మరోసారి ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. పేరుగల్ల పెద్దిరెడ్డి అంటూ వచ్చిన ఈ పాట తండ్రి మీద ప్రేమతో కూతురు చెబుతున్న నేపథ్యంలో ఉంది. పల్లెటూరి వాతావరణాన్ని, జానపద లయను ప్రతిబింబిస్తూ ఈ పాట ఆకట్టుకుంటుంది. ఎప్పటిలాగే, నాగదుర్గ ఈ పాటలో తనదైన శైలిలో చేసిన ఎనర్జిటిక్ డ్యాన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. శుక్రవారం విడుదలైన ఈ పాట కొద్ది గంటల్లోనే యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌ను సాధిస్తూ ట్రెండింగ్‌లో నిలిచింది. ప్లలె జానపద పాటల అభిమానుల మధ్య ఈ పాట క్రేజీ హిట్‌గా మారడంతో నాగదుర్గ ఖాతాలో మరో విజయవంతమైన జానపద పాట చేరింది. ఈ పాటకు బుల్లెట్ బండి లక్ష్మణ్ సాహిత్యం అందించగా.. మమత రమేష్ పాడింది. మదన్ కే సంగీతం అందించాడు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

# వేములవాడ స్కై స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ సందడి

**నేటి సాక్షి, వేములవాడ :** వేములవాడ సాయినగర్‌లోని స్కై స్కూల్ లో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌కు సందడిగా సాగింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు రోజువారీగా అందించే వివిధ రకాల ఆరోగ్యకర ఆహారాలను ఈ వేడుకలో ప్రదర్శించగా, పిల్లలు కూడా పెద్దలతో కలిసి వంటకాలను తయారుచేసి తీసుకువచ్చారు. సాంప్రదాయ వంటకాల ప్రాధాన్యం, బయట లభించే జంక్‌ఫుడ్ వల్ల కలిగే నష్టాలను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు స్కూల్ కరస్పాండెంట్ మహేష్ తెలిపారు. హొమ్‌మేడ్ ఫుడ్ ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అలాగే పిల్లలకు ఆకుకూరలు, స్వీట్లు, పెరుగు, పీచుపదార్థాలు, బెల్లంతో తయారు చేసిన వంటకాలు అందించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రీ-ప్రైమరీ పిల్లలకు సహజంగా లభించే పండ్ల ప్రయోజనాలు కూడా ఉపాధ్యాయులు వివరించారు. వంటకాలను ఎలా తయారు చేశారో, వాటిని తినడం వల్ల కలిగే లాభాలు ఏమిటో విద్యార్థులే స్వయంగా వివరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫుడ్ ఫెస్టివల్ విద్యార్థుల్లో ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను పెంపొందించే



ప్రయత్నంగా విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ జమున, ఉపాధ్యాయులు స్రవంతి, శైలజ, అర్చన, స్రవంతి, శ్రీ హేమకళ, దివ్య, మమత, చంద్రకళ, అంజలి, సూపర్వైజర్ రాము పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్, ఆసిఫాబాద్ లో దీక్షా దివస్ వేడుకలు



**నేటి సాక్షి.కుమురం భీం ఆసిఫాబాద్ :** పట్టణంలోని తెలంగాణ భవన్‌లో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈరోజు "దీక్షా దివస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి గారు, రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు, మరియు సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గారు ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి వర్యులు కె.సి.ఆర్. గారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, దీక్షా దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కె.సి.ఆర్. గారు చేసిన నిరంతర ఉద్యమం గురించి నాయకులు వివరించారు. తెలంగాణ ఏర్పాటు కోసం కె.సి.ఆర్. గారు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేసుకున్నారు. ఉద్యమంలో పాల్గొని, బలిదానాలు చేసుకున్న కుటుంబాలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, brs కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

# తెలంగాణను అగ్రపథాన నిలిపిన దార్శనికులు కేసీఆర్

- **కెసిఆర్ ని మరో మారు ముఖ్యమంత్రి చేసేవరకు ప్రతి నాయకుడు, కార్యకర్త దీక్షగా పనిచేయాలి : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ....**

**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ నవంబర్ 29:** ఈరోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి గండి మైసమ్మ లోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారి అధ్యక్షతన నిర్వహించిన "దీక్షా దివాస్" కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తో పాటుగా ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ లు పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధకులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అడుగడుగున అవమానాలు, వివక్షతకు గురైన ఈ ప్రాంతం ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారా ఆవిర్భవించిన తెలంగాణను



పదేళ్ల కాలంలో దేశంలోనే అగ్రపథాన నిలిపిన దార్శనికులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ న్నారు. నాడు తెలంగాణ రాష్ట్రం కోసం తమ పదవులను సైతం తృణప్రాయంగా వదిలేసిన గొప్ప నాయకులు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన తీరును, ఉద్యమ పంథాను నేటి యువతకు తెలియజేయాలన్నారు. రానున్న తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో కేసీఆర్ ని మరోమారు సీఎం చేసే వరకు ప్రతీ నాయకుడు, కార్యకర్త ఒక దీక్షతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను మలుపు తిప్పిన రోజు దశ దిశ దీక్ష దివాస్




- **ఘనంగా దీక్ష దివాస్ కార్యక్రమం లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు వ్యాల్ల హరిష్ రెడ్డి**

**నేటి సాక్షి గోదావరిఖని (రమేష్) :** ప్రధాన చౌరస్తాలో నవంబర్ 29 దీక్ష దివాస్ కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ నాయకులు వ్యాల్ల హరిష్ రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలతో ఘన నివాళి అర్పించడం జరిగింది. అనంతరం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. అనంతరం వ్యాల్ల హరిష్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ ఉద్యమచరిత వేల పుటల బృహత్ గ్రంథం. ఉద్యమ పథంలో కీలక మరుపురాని సందర్భాలు కోకొల్లలు. కానీ రాష్ట్రసాధన ఉద్యమాన్ని మలుపుతిప్పి, గెలుపు వైపు నడిపించిన అరుదైన ఘట్టం.. దీక్షా దివస్ అది కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం అది అరవై ఏండ్ల పోరాటానికి క్లైమాక్స్ ఎపిసోడ్ ఆ 11 రోజులు. తెలంగాణ నలుదిశలను ఏకం చేసింది. 'ప్రత్యేక రాష్ట్రం వచ్చుడో కేసీఆర్ సచ్చుడో కేసీఆర్ శవయాత్రో తెలంగాణ జైత్రయాత్రో అని గర్జించేంత ధైర్యం తన ఉద్యమంపై నమ్మకం ఏ నాయకుడికి ఉంటుంది. ఒక్క కేసీఆర్‌కు తప్ప అందుకే రాష్ట్ర సాధన కోసం రణగర్జన చేసి కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష. గల్లీ గల్లీనీ కదలించింది. ఢిల్లీని వణికించింది 2009 నవంబర్ 29 వలస పాలనపై అంతిమ సమరానికి సన్నద్ధమైన తెలంగాణం పోరు గడ్డపై నిలబడి తెలంగాణ తరఫున కేసీఆర్ చేసిన ఆమ రణం ఒక్క పిలుపుతో కేసీఆర్ వెంట నడిచిన తెలంగాణ జన సైన్యం ముక్కోటి తెలంగాణ బిడ్డల ఆకాంక్షలే ఆయన కవచం పోరు భూమిలో మరణానికి ఎదురు వెళ్లిన కేసీఆర్ మొండి ధైర్యం అకుంఠిత దీక్షను చూసి ఆసేతు హిమాచలం ఆశ్చర్య పోయిన వైనం తెలంగాణ ప్రకటన రూపంలో కేసీఆర్ సాధించిన అద్భుత విజయం. తెలంగాణ స్వ రాష్ట్ర పోరాటానికి సగర్వంగా జై కొడుతూ కేసీఆర్ అద్భుత పోరాటాన్ని స్మరించు కుంటూదీక్షా దివస్‌ను జరుపుకుందాం అని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ కార్పొరేటర్ ఐత శివ కుమార్, రమణ రెడ్డి, రవి నాయక్, బక్కి కిషన్, మెరుగు చంద్రమొగిలి, జాహిద్ పాషా, కృష్ణ స్వామి, అనుముల కళావతి, పరుశ స్వాతి, రామస్వామి, అల్లి గణేష్, బోట్ల పోషం, బూరుగు వంశీక్రిష్ణ, అత్తరుదిన్, బోట్ల పోషం, ఉదయ్, శ్రీనివాస్ రావు, సిగిరి రాము, నడిపల్లి సాయి, షరీఫ్, తిరుమల్, గొర్రె శంకర్, గొర్రె నర్సింగ్, కొండ సురేష్, అనిల్, పోయిల రవి, శ్యామ్, ప్రవీణ్, యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల ఎమ్మెల్యే ని కలిసిన డిప్యూటీ DMHO డా. జైపాల్ రెడ్డి



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ గా పదోన్నతి పొందిన డా జైపాల్ రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎం ఎల్ ఏ సంజయ్ కుమార్



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** జగిత్యాల పట్టణ 25వ వార్డులో 35 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను స్తానిక నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్. జగిత్యాల పట్టణంలో అభివృద్ధి పనులు నాణ్యత తో చేపట్టాలి అని, అధికారులు నిరంతర పరిశీలన చేపట్టాలని అధికారులకు సూచించారు. జగిత్యాల పట్టణంలో ప్రజలకు సమస్య లేకుండా దాదాపు అన్ని సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టడం జరుగుతుంది అని అన్నారు. అత్యధిక నిధులు తీసుకువచ్చి, మునుపెన్నడు లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరుముల్ల పవన్, AE లు అనిల్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# స్లెట్ హై స్కూల్ లో ఘనంగా ఆరెంజ్ డే వేడుకలు



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** జగిత్యాల జిల్లా పట్టణంలోని స్లేట్ హైస్కూల్లో ఆరెంజ్ డే వేడుకలు శనివారం నాడు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డి, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, రాజ్యలక్ష్మి, ప్రిన్సిపల్ స్వప్న పాల్గొన్నారు. ఈ వేడుకలను ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న మాట్లాడుతూ సాధారణంగా ఆరెంజ్ డే వేడుకలను శీతాకాలంలో జరుపుకుంటారు ఈ వేడుకలు చాలా ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని అన్నారు. పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ సాధారణంగా రైతులు వానకాలం పంట బాగా పండిందని ఆనందంతో నిర్వహించుకుంటారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయురాలు మరియు విద్యార్థిని విద్యార్థులు ఆరెంజ్ కలర్ దుస్తులు ధరించుకొని పలువురుని ఆకర్షించారు. అదేవిధంగా కొంతమంది విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..




# జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటులో ముందడుగు

- **తిరుపతి ఎంపీ గురుమూర్తి లేఖతో నవోదయ విద్యాలయ సమితిలో కదలిక**

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల):** తిరుపతి పార్లమెంట్ పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయం అవసరం ఉందని గుర్తించిన ఎంపీ మద్దిల గురుమూర్తి ఈ విషయాన్ని తెలియజేస్తూ ఇటీవల జవహర్ నవోదయ విద్యాలయ సమితికి లేఖ రాశారు. తిరుపతిలో ఐఐటీ, ఐజర్ వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థలు ఉన్నప్పటికీ, గ్రామీణ విద్యార్థులకు స్కూల్ స్థాయిలో నాణ్యమైన విద్యా అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఎంపీ ఆ లేఖలో పేర్కొన్నారు.గ్రామీణ, పేదరికంలో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో నవోదయ విద్యాలయాలు ఎంతో కీలకమని ఎంపీ అధికారులకి వివరించారు. ఎంపీ చేసిన విజ్ఞప్తికి స్పందించిన నవోదయ విద్యాలయ సమితి, ప్రతి జిల్లాలో ఒక నవోదయ విద్యాలయం ఉండాలనే పథకం ఉన్నప్పటికీ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో ఇంకా ఈ పాఠశాల లేని విషయం గుర్తించింది నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన స్థలాన్ని ఉచితంగా కేటాయించాల్సి ఉంటుందని, శాశ్వత భవనం నిర్మాణం అయ్యేవరకు తాత్కాలిక భవనాన్ని కూడా రాష్ట్రం అందించాల్సి ఉంటుందని నవోదయ విద్యాలయ సమితి స్పష్టం చేసింది. తిరుపతి జిల్లాను కూడా నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు పరిశీలన్లో భాగంగా పరిగణించనున్నట్లు కేంద్రం ఎంపీకి ఇచ్చిన లేఖలో పేర్కొంది. ఎంపీ గురుమూర్తి లేఖ అనంతరం సదరు శాఖలో కదలికల ప్రారంభమైంది. తిరుపతి జిల్లాలో నవోదయ విద్యాలయ ఏర్పాటు కోసం అనువైన స్థలం కేటాయించేందుకు పరిశీలన ప్రస్తుతం జరుగుతోంది. త్వరలోనే నవోదయ విద్యాలయం తిరుపతి జిల్లాలో జవహర్ నవోదయ ఏర్పాటు అవుతుందని ఎంపీ గురుమూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.




# కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి

**నార్నూర్ మండలం సన్నాహక సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**



**నేటి సాక్షి కొమురం భీం ఆసిఫాబాద్ నార్నూర్:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు లోకండె దేవ్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ..గ్రామస్థాయి సమస్యలు, అభివృద్ధి అవసరాలను తీర్చటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రజల్లో నమ్మకం ఏర్పరచాలి. పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామాల్లో సమన్వయం పెంచుకుంటూ, అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు.సమావేశంలో స్థానిక నాయకులు, సర్పంచ్ ఆశావహులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.డీసీసీ కార్యాలయం, కుమురంభీమ్ ఆసిఫాబాద్

# పాత్రికేయుల సమావేశంలో ప్రతాప రామకృష్ణ



**నేటి సాక్షి, కొడిమ్యాల నవంబర్,29:** కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ. విలేకరుల సమావేశంలో మాట్లాడుతు గ్రామ గ్రామానికి ఉపాధి హామీ, పనులు ఇందిరమ్మ ఇండ్లకు, లక్షనలభై ఐదు వేయిలు ఇస్తూ . ప్రభుత్వ స్కూలుకు వెళ్లే పిల్లలు దూరం నుండి నడిచి వెళ్తుంటే ఇబ్బందిగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వం గమనించి 10వ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేసిందని తెలియజేస్తూ, అన్ని విధాలుగా దేశ ప్రజల అభివృద్ధి ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ పట్నాల నుంచి పల్లెల వరకు అభివృద్ధి చేయుటకు నిధులు మంజూరు చేస్తున్న బిజెపి, స్థానిక సర్పంచ్ ఎలక్షన్ లో మండలంలోని 24 గ్రామపంచాయతీలలో బీజేపీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, పెరుక శ్రావణ్ మండల బిజెపి అధ్యక్షులు బండ నరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నాంపల్లి రాజేశం సీనియర్ నాయకులు ఏలేటి నరసింహారెడ్డి. అక్కెనపల్లి నరేష్. కార్యకర్తలు పాల్గొన్నారు

# అయ్యప్ప పడి పూజ కార్యక్రమం లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** జగిత్యాల మాజీ మున్సిపల్ ఛైర్మెన్ గిరి నాగభూషణం గారి స్వగృహం లో అయ్యప్ప పడి పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ,జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందయ్య.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు మెట్టబట్టి,అడువల జ్యోతి లక్ష్మణ్,స్తానిక నాయకులు,అయ్యప్ప దీక్షపరులు తదితరులు పాల్గొన్నారు.

# పౌర హక్కుల దినోత్సవం నిర్వహణ

- **డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహణ**

**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ నవంబర్ 29 :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ 128డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవము నిర్వహించామని కాలని ప్రెసిడెంట్ ముత్యపాగ నర్సింగ్ రావ్ తెలిపారు, ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్,గాజులరామారం రెవెన్యూ ఇనస్పెక్టర్, జి ఎచ్ ఏం సి అధికారులు, ఎచ్.ఏం. డబ్ల్యూ. ఎస్. ఎస్. జనరల్ మేనేజర్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ అధికారులు, సివిల్ సప్లైస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల హక్కుల గురించి పౌర సేవల గురించి ప్రజలకు వివరించారు, ప్రజలు వివిధ సమస్యల పై అధికారులకు వినతి పత్రం ఇచ్చారు, తహసీల్దార్ అశోక్ కుమార్ ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కారం అయ్యేల చర్యలు తీసు కుంటామని ప్రజలకు హామి ఇచ్చారు. ఈ




కార్యక్రమం లో కుత్బుల్లాపూర్ దళిత సంఘాల మాజీ అధ్యక్షుడు జేమ్స్, ప్రేమ్ కుమార్, బుచ్చయ్య,ముత్యపాగ నర్సింగ్ రావ్, కో గోపాల్,పాండు, మేకల సత్యనారాయణ, మాజీ హెడ్ మాస్టర్ పుండరికం,మహిళ నాయకులు రాణి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి 2 వ స్థానంలో...

**కొడిమ్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు**



**నేటి సాక్షి, కొడిమ్యాల నవంబర్, 29, కొడిమ్యాల శనివారం :** చెకు ముకి సైన్స్ సంబరాలు -2025 టాలెంట్ టెస్ట్ జగిత్యాల జిల్లా స్థాయి లో కోడిమ్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు కె అశ్విని,,వి అక్షర,,బి సహస్ర లు ఉత్తమ ప్రతిభా కనబరిచి 2 వ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ బి లావణ్య, చెకు ముకి కో కన్వీనర్ నిషాని మహేందర్,తెలియజేశారు.ఇవిజయానికి కారణమైనా విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల కు ప్రిన్సిపాల్ గారు ప్రత్యేక అభినందనలు తెలిపారు.విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవరచు కొని రాబోవు రోజుల్లో ఇలాంటి విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సైన్స్ టీచర్స్ విజయ్ కుమార్,తబస్సుమ్, శ్రీధర్ ,మరియు ఉపాధ్యాయులు రాజేశం, రమణ, శరణ్య, ప్రమోద,శిరీషా, మల్లేశం, భాగ్య లక్ష్మీ, రోహిణి, సౌజన్య,, అంజలి,, సత్యానందం, ,అనూప్,, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ గమ్యాన్ని మార్చిన చారిత్రక రోజు దీక్షా దివస్




- **బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన దీక్ష ఒక చారిత్రక ఘట్టం**
- **రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్.**

**నేటి సాక్షి గోదావరిఖని (రమేష్) :** తెలంగాణ గమ్యాన్ని మార్చిన చారిత్రక రోజు దీక్షా దివస్ .. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన దీక్ష ఒక చారిత్రక ఘట్టమని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం దీక్షా దివస్ వేడుకలు పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయం లో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి కోప్పుల ఈశ్వర్ జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాజీ జిల్లా గ్రంధాలయ చైర్మన్ రఘువీర్ సింగ్ నాయకురాలు దాసరి ఉషా హజరైయ్యారు. సందర్భంగా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ..కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో' కేసీఆర్ శవయాత్రనా తెలంగాణ జైత్రయాత్రనా అంటూ ఆనాడు కేసీఆర్ ఇచ్చిన నినాదం సమరనాదంగా పనిచేసి మొత్తం తెలంగాణ జాతిని ఏకం చేసిందని, 11 రోజుల పోరాటంతో తెలంగాణలో పోరాటం పోటెత్తిందన్నారు. కేసీఆర్ దీక్ష వల్లనే తెలంగాణలోని సబ్బండ వర్గాలు కలిసి వచ్చి తెలంగాణ కావాలని కొట్లాడరని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ దీక్షకు దిగివచ్చి డిసెంబర్ 9 తేదీన తెలంగాణ ఏర్పాటుకు సంబంధించిన ప్రకటన వచ్చిందన్నారు. స్వతంత్ర సంగ్రామ పోరాటంలో సిపాయిల తిరుగుబాటు జలియన్వాలా బాగ్ ఉప్పు సత్యాగ్రహం సహాయ నిరాకరణ క్విట్ ఇండియా వంటి అనేక ముఖ్య ఘట్టాలు ఉన్నాయని అదే తీరుగా తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలోనూ అపూర్వమైన ఘట్టాలు ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. చరిత్రను మలుపు తిప్పిన సమున్నత సందర్భాలలో కేసీఆర్ ఆమరణ దీక్ష ఒకటి అని నవంబర్ 29, 2009వ సంవత్సరం ఉద్యమ చరిత్రలో ఒక ఉజ్వల దృశ్యంగా నిలిచిపోతుందన్నారు.తెలంగాణ కోసం కలకంటూ తెలంగాణ జాతి కోసం తన పోరాటాన్ని ఇచ్చి సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ తెలిపారు. 1952 నుంచి కేసీఆర్ తెలంగాణ కోసం గులాబీ జెండా ఎత్తే వరకు అన్ని సందర్భాల్లోనూ కాంగ్రెస్ పార్టీతో పాటు సమైక్యవాద శక్తులు ఎక్కడికక్కడ తెలంగాణ ఉద్యమానికి చేసిన ద్రోహాలను, మోసాలను గుర్తుంచుకొని మలిదశ పోరాటంలో ఆ సవాళ్లు అన్నింటిని దాటుకుంటూ ముందుకు సాగిన మహా నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ఉద్యమంలో పట్టువిడుపులతో ముందుకు సాగిన కేసీఆర్ చాణక్యం వల్లనే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని, ఇందులో భాగంగా ఎన్నో పదవి త్యాగాలు, ఎన్నో రాజీనామాలు చేసిన పార్టీ భారత రాష్ట్ర సమితి అన్నారు. తమ పార్టీ ప్రజా ప్రతినిధులు పదవులకు రాజీనామా చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ నేతలు పదవుల కోసం బానిస లెక్క పెదవులు మూసుకుని తెలంగాణకు విద్రోహం చేశారని తెలిపారు.

# ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలి

**అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత**



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలకు రాగానే వేగవంతంగా కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ బి.ఎస్.లత తెలిపారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, వెల్గటూర్ మండలంలో శ్రీనిధి, కృష్ణ రైస్ మిల్లులను, మరియు గొల్లపల్లి మండలంలోని సూర్య రైస్ మిల్లును అదనపు కలెక్టర్ (రెవిన్యూ) ఆకస్మికంగా సందర్శించారు.

**వాతావరణ పరిస్థితుల దృష్ట్యా..**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నాణ్యత ప్రమాణాల ప్రకారం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి అదే రోజు రైస్ మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం నాణ్యతను రెగ్యులర్ గా చెక్ చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకం ధాన్యం 17 శాతం తేమ ఉన్నా కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, రైతులకు 48 గంటల్లోగా చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రల వద్ద రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. రైస్ మిల్లుల వద్ద ఎలాంటి జాప్యం లేకుండా దిగుమతి అయ్యేలా చూడాలని అన్నారు. హమాలీల సమస్య లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని సెంటర్ నిర్వహకులతో సమన్వయం చేసుకోవాలని రైస్ మిల్లు యజమానులకు సూచించారు. రికార్డులు పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు అప్ డేట్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, క్లస్టర్ అధికారులు, సివిల్ సప్లై అధికారులు, సెంటర్ ఇంచార్జులు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సహపంక్తి భోజనాలను ఉపాధ్యాయులు అలవర్చుకోవాలి

**సూక్ష్మ, చిన్న,మధ్య తరహా పరిశ్రమల డైరెక్టర్ చిన్నబాబు**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** రామచంద్రాపురం: విద్యార్థులతో కలిసి ఉంటేఉపాధ్యాయులు సహ పంక్తి భోజనం చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డ్ డైరెక్టర్ చినబాబు సూచించారు. శనివారం రామచంద్రాపురం మండలం కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోజనం చేస్తే తమ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నామన్న భావన విద్యార్థుల్లో కలుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి విద్యార్థులకు ఆహార విషయంలో ఎటువంటి లోటు లేకుండా చేస్తున్నారని, దీనిని ఉపాధ్యాయులు గ్రహించి విద్యార్థులతో మమేకం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి హేమాంబరరావు, వనమాలి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సభాపతి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# శాప్ చైర్మన్ రవినాయుడు ఆకస్మిక పర్యటన

**తిరుపతి గొల్లవాని గుంటలో**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** తిరుపతి గొల్లవాని గుంటలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం మరియు పలు క్రీడా ప్రాంగణాలు పురోగతిని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు పరిశీలించారు సందర్శన సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని ఆరా తీసిన చైర్మన్ రవినాయుడు , పనులను మరింత వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. త్వరితగతిన ఈ వసతులు క్రీడాకారులకు అందుబాటులోకి రావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ , గంగమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ మహేష్ యాదవ్ , కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ్ , మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీధర్ , జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డి ఎస్ డి ఓ శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

**డా.రాజు**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** విద్యార్థులు పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సామాజికవేత్త, డాక్టర్ రాజు అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్వీ మోడల్ హైస్కూల్లో నెహ్రూ ఆలోచన విధానం- శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నిత్యజీవితంలో జరిగే అనేక అంశాలతో సైన్స్ ముడిపడి ఉందని, అనేక అనుమానాలకు అపోహలకు గురి కాకూడదని మంచి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమ నాయకులు కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని ప్రశ్నించుకోవడం ద్వారా సమాధానం దొరుకుతుందని, చిన్న చిన్న విషయాలకే కృంగిపోకుండా ఆత్మస్థైర్యంతో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి, మ్యాజిక్ ద్వారా విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించారు. తదనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలను సద్వినియోగం చేసుకోవాలి



- **ఎన్నికల నిబంధనాలను పాటించాలి....**
- **మరికల్ ఎంపీడీవో పృథ్వీరాజ్ ....**

**నేటిసాక్షి, నారాయణపేట :** జిల్లాలోని మరికల్ మండలంలోని వివిధ గ్రామాల్లో జరగనున్న స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికలను గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మరికల్ మండల ఎంపీడీవో పృథ్వీరాజ్ కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ పరిధిలో క్లస్టర్ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 1, మరికల్,2, అప్పంపల్లి,ఇబ్రహీంపట్నం పసుపుల, 3,జిన్నారం, చిత్తనూరు, ఏక్లాస్పూర్,4 తిలేరు,పెద్ద చింతకుంట, వెంకటాపూర్, 5, మాధ్వార్, పల్లె గడ్డ, పూసల్పాడు, రాకుండా,6, కర్మనూరు, బుడ్డగాని తాండ, ఎలిగిండ్ల,ఈనెల 30న గ్రామపంచాయతీ సర్పంచ్ల నామినేషన్ నిర్వహించినట్లు ఆయన వివరించారు.

# సంజయ్ గాంధీ నగర్ సమస్యలపై వినతి



**(నేటి సాక్షి రావుల శేషగిరి కుత్బుల్లాపూర్ నవంబర్ 29:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సూరారం డివిజన్ పరిధిలో సంజయ్ గాంధీ నగర్ సమస్యలపై వినతి పత్రం మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ కి గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి తో కలిసి అందజేయడం జరిగింది.

# రాజులూరిలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి నవంబర్ 29 :** మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ ది రాజులూరు సమీపంలో గల కేపీఎల్ మైదానంలో మండలంలోని ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు జరిగాయి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జరిగిన ఈ పోటీలలో డివిజన్ స్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులను ఎంపిక చేశారు పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ మ్యాచ్ నందు ఎంఈఓ కేశవరెడ్డి మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ నందు రెండవ ఎంఈఓ తిరుమల చేసే అధికారులుగా నియమితులయ్యారు ఇరుజట్లలో గెలుపొందిన వారు డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు వెళతారని వివరించారు ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# మరికల్ గ్రామ ఎన్నికల అధికారిగా పాలెం శివయ్య



**నేటి సాక్షి,నారాయణపేట, నవంబర్ 29 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలం పరిధిలోని మరికల్ గ్రామ ఎన్నికల అధికారిగా పాలెం శివయ్య బాధ్యతలు శనివారం స్వీకరించారు. సహాయ అధికారిగా జి.లక్ష్మయ్య బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం మరికల్ గ్రామంలోని వివిధ పార్టీలకు సంబంధించిన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల అధికారి వివరించారు. నిబంధనలు పాటించి ఎన్నికల అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

# రామాపురం డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన..

**స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్.**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :**రామాపురం వద్ద ఉన్న చెత్త నిర్వహణ డంపింగ్ యార్డును స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్ శనివారం సాయంత్రం అధికారులతో కలసి పరిశీలించారు. చెత్త నిర్వహణ ఎలా చేస్తున్నారు? ఎక్కడికి తరలిస్తున్నారు? తదితర వాటిని పరిశీలించారు. గడువు లోపు చెత్త నిర్వహణ పూర్తి చేయాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. చైర్మన్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రమణ, తదితరులు ఉన్నారు.

# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..

12

ఆదివారం
30 నవంబర్ 2025


## బుపెల్లి బానయ్య సేవలు అపూర్వం



**నేటి సాక్షి గోదావరిఖని (రమేష్) :** దమ్మాయి గూడ నాగారం మున్సిపాలిటీ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుపెల్లి బానయ్య సంతాప సభ లో పలువురు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించించారు. ఈ సంతాప సభను ఉద్దేశించి సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ... దివంగత బానయ్య సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు, సీనియర్ సిటీజన్ లకు ఎన్నో సేవలు చేశారని, భౌతికంగా ఆయన లేకున్నను ఆయన సేవలు సమాజం గుర్తించుకుంటుదని, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పెన్షన్, మెడికల్ సర్వీసుల కొరకు ఉద్యమించి, మార్గదర్శులుగా ఉన్నారు.బానయ్య మరణం సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు తీరని లోటని తెలిపారు. ఈ సంతాప సభలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దండంరాజు రాంచందర్ రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆళ వందార్ వేణు మాధవ్,జి.వి.రాజి రెడ్డి, టి.ఉమాకర్, ఎం.విజయ్ బాబు,ఎస్.నర్సింగ్ రావు, జయంత్ కుమార్ ,రాజనర్సు, ఎస్.లక్ష్మి నారాయణ,చుక్కల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మరికల్ లో శ్రీ అయ్యప్ప స్వాముల రాస్తారోకో, ర్యాలీ



**నేటి సాక్షి,నారాయణపేట, నవంబర్ 29 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో అయ్యప్ప స్వాములు కంచన్బాగ్ ఎస్ ఐ అయ్యప్ప మాల వేసుకున్నందుకు పోలీసులు అయ్యప్ప మాలలు వేసుకోవద్దని హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి ఇచ్చిన మెమో వెనక్కి తీసుకోవాలి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యప్ప స్వాములకు క్షమాపణ చెప్పాలని ఈ రాజ్యంలో అందరూ సమానమేనని హిందువులకు ఒకరకమైన నియమాలు వేరే వారికి ఒక రకమైన నియమాలు ఉండేటట్టు చూడడం రాజ్యాంగ వ్యతిరేకమని మరికల్లో పెద్ద ఎత్తున రాస్తారోకో ర్యాలీ చేయడం జరిగింది. ఈ రాస్తారోకోలో మరికల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రయాణికుల సౌకర్యాలు మెరుగు పర్చకపోతే బిజెపి ఆందోళన



**నేటి సాక్షి,నారాయణపేట, నవంబర్ 29 :** నారాయణపేట ఆర్టీసి డిపో నుంచి ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగు పరచాలని లేకపోతే బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని బిజెపి నాయకులు రఘువీర్ యాదవ్,మిర్చి వెంకటయ్య,శీల చంద్రశేఖర్ రెడ్డి, సత్య రఘుపాల్, సై దప్ప హెచ్చరించారు.శనివారం సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ డిపో మేనేజర్ కు వినతి పత్రం సమర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పుణ్య క్షేత్రాలకు నడిపే బస్సులు ఇలా ప్రారంభిస్తారు అలా రద్దు చేస్తారని విమర్శించారు. కర్ణాటక బస్సులు నడుస్తుండ దంతో తెలంగాణ ఆదాయం కొల్లగొడుతున్నారని అన్నారు.అయినా ఆర్టీసి అధికారులకు పట్టడంలేదని అన్నారు.ప్రజల సౌకర్యం కోసం ఆదాయం కోసం ఇంటర్ స్టేట్ పర్మిట్ తీసుకుని సైదాపూర్, యాడగిర్, రై చూర్,సెడం,గుల్బర్గా ప్రాంతాలకు బస్సులు నడపాలని కోరారు.అలాగే ప్రతి బస్టాండ్ అపరి శుభ్రంగా ఉన్నాయని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.లేకపోతే డిపో ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- **ఎన్నికల ప్రక్రియ పై అధికారులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలి**
- **జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్**

**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో జిల్లా అదనపు కలెక్టర్ ఆద్వర్యంలో ఆర్వోలకు, ఏఆర్వోలకు ఫేజ్ -3 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ట్రైనింగ్ కార్యక్రమాన్ని వీడియో పవర్ ప్రెజెంటేషన్ ద్వారా అవగహన కల్పిస్తూ ఎన్నికల విధుల పట్ల దిశానిర్దేశం చేశారు.

### నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలి

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాజగౌడ్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలంటే మనకు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు చాలా ముఖ్యమైన అంశమని, దీని పైన చాలా కేసులు దాఖలు అయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని తెలిపారు. అధికారిక ప్రకారం మాత్రమే రిజర్వేషన్ అంశాలను పరిశీలించాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### అనుమతుల కోసం..తాహాశీల్దరులను సంప్రదించాలి

ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రాలు, ప్రచార వాహనాల అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత మండల తహసిల్దార్లను సంప్రదించాలని తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా సర్పంచ్ అభ్యర్థికి 8, వార్డు సభ్యులకు 6 కంటే ఎక్కువ నామినేషన్ దాఖలు ఐతే తమకు తెలియజేయాలని అన్నారు. అభ్యర్థుల యొక్క అన్ని వివరాలు నామినేషన్ పత్రాలలో పూర్తిగా నమోదు చేయాలని, లేనిచో అట్టి నామినేషన్ ను తిరస్కరించాలని సూచించారు. ప్రతి చిన్న అంశాన్ని,అనుమానాలను శిక్షణ లో పూర్తి స్థాయిలో విచారించి తెలుసుకోవాలని సూచించారు. ట్రైనింగ్ హాల్ నుంచి పూర్తి అవగాహనతో బయటకు వెళ్లాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమవాళికి లోబడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు అధికారులు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ కు ఒకరోజు ముందుగా కొత్త బ్యాంక్ ఖాతా తీసుకునే విధంగా వారికి తెలియజేయాలని సూచించారు.ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ఒరిజినల్ పత్రాలను



సంబంధిత గ్రామ పంచాయతీలలోని ఆర్వో ల వద్ద పొందవచ్చని తెలిపారు. Xerox కాపీ లు వాడవద్దని, వార్డు సభ్యుడు పోటీ కోసం అదే వార్డు సభ్యుడు ప్రొపోజర్ గా ఉండాలి. సర్పంచ్ గా పోటీచేసే అభ్యర్థి డిపాజిట్ క్రింద కేటగిరి వారిగా చెల్లించాలని, ఏమైనా అప్పీల్ ఉంటే %=ణూ% ను సంప్రదించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసుధన్, జిల్లా వ్యయ పరిశీలకులు జనరల్ అబ్జర్వర్ జి. రమేష్,డి ఈ వో రాము, మదన్ మోహన్, రేవంత్, డి వై ఎస్ వో రవి, జిల్లా నోడల్ అధికారులు, జిల్లా ఎన్నికల విభాగం, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు

- **ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలి**
- **నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల జిల్లాలో తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ముగింపు సందర్భంగా కోరుట్ల మండలం యూసుఫ్ నగర్ గ్రామం మరియు మెట్ పెల్లి మండలంలోని మేడిపెల్లి, బండలింగాపూర్ మరియు వెల్లుల్ల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.

### క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీస్ బోర్డుపై సక్రమంగా ప్రదర్శించబడ్డాయా అనే విషయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం వరకు ఎన్ని నామినేషన్లు స్వీకరించబడ్డాయి..అలాగే నామినేషన్ల ఫార్మ్ ఎంతమంది అభ్యర్థులు తీసుకున్నారనే వివరాలను సంబంధిత అధికారుల నుంచి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు .దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు.నామినేషన్ స్వీకరణ, రికార్డు నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆయన పలు సూచనలు అందించారు. నామినేషన్ ప్రక్రియ చట్టబద్ధంగా, ఎవరికీ



ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు మరియు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై అతికించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

### మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటించాలి

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు.నవంబర్ 27 నుంచి నవంబర్ 29 వరకు తొలి విడత ఎన్నికల ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు.నవంబర్ 30 రోజున వీటి పరిశీలన ఉంటుందని తెలిపారు.డిసెంబర్ 3 వరకు ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మొదటి విడతలో 7 మండలాల్లోని 122 గ్రామాలు, 1172వార్డుల్లో డిసెంబర్ 11 న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుందని అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.ఈ పరిశీలనలో కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు జివాకర్ రెడ్డి, శ్రీనివాస్,ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆర్లెగూడెంలో -బిజెపిలోభారీగా చేరికలు

**నేటి సాక్షి, చిలుకూరు మండలం :** చిలుకూరు మండల పరిధి l ఆర్లగూడెం గ్రామం. గౌరవ ప్రధానమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పథకాలను చూసి మన భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రధానమంత్రి గారికి తోడుగా క్షేత్ర స్థాయిలో బిజెపి పార్టీని బలోపేతం చేయడానికి ఆర్లే గూడెం గ్రామం నుండి సాగర్ల శివ రావు ని మండల పార్టీ అధ్యక్షులు పొరెల్లి మహేష్ పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించారు ఆర్లెగూడెం గ్రామపంచాయతీ బిజెపి. సర్పంచ్ అభ్యర్థిగా శివ రావు ని మామిడి నాగయ్య ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఎన్నికల కన్వీనర్ తిపిరిశెట్టి బసవయ్య మాట్లాడుతూ శివ రావు ని గ్రామ ప్రజల అత్యధిక మెజార్టీతో గెలిపించి అనేక కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కేంద్రంగా ఆర్లెగూడెం నుండి ఇప్పుకోవాలని తెలిపారు కార్యవర్గ సభ్యులు బత్తిని శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు కొండా శ్రీను, రామినేని నరసింహా



వర్మ, మండల కోశాధికారి మునుగంటి నాగాచారి, బేతవోలు గ్రామ శాఖ అధ్యక్షులు బుడిగ సురేష్, సాగర్ల సైదయ్య తదితరులు పాల్గొన్నారు

# కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలించిన ఆడిట్ బృందం

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అకాడమిక్ ఆడిట్ బృందం శనివారం సందర్శిచారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు 2022 - 23 మరియు 2023 - 24 సంవత్సరాలకు గాను కళాశాలలోని మౌళిక వసతులు, తరగతుల నిర్వహణను పరిశీలించడానికి రామన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రెహత్ ఖానం, నల్లగొండ మహిళా కళాశాల సీనియర్ అధ్యాపకులు డా. వెంకటకృష్ణ కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి అన్ని రకాల సదుపాయాలను, వివిధ రకాల వసతులను, సైన్స్ ల్యాబ్ లను, లైబ్రరీ, స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్, ఎన్. సి.సి తదితర విభాగాలన్నింటిని వాటి యొక్క తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్. భీమార్జున రెడ్డి ని, అధ్యాపక,



అధ్యాపకేతర బృందాన్ని, నాగరాజు, విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వచ్చే సంవత్సరం జరగబోయే న్యాక్ లో మంచి గ్రేడింగ్ సాధించే విధంగా అందరూ కృషి చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జున రెడ్డి

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం
30 నవంబర్ 2025


# ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

- ప్రజా సేవకు బద్ధులై పనిచేయాలి
- ఎస్సీ ఎస్టీ సమస్యలకు తక్షణం పరిష్కార మార్గం చూపాలి
- డి.వి.యం.సి సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్లు
- జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేసిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) తిరుపతి నవంబర్ 29 :** అధికారులు ప్రజా సేవకు బద్ధులై పనిచేసినప్పుడే.. ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేందుకు వీలవుతుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్లు తెలియజేశారు. అంతేకాకుండా ఎస్సీ ఎస్టీ సమస్యలకు తక్షణ పరిష్కార మార్గాన్ని చూపినవారవుతారని వారు చెప్పారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి, జవాబుదారీగా తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించాలని..,నానబెట్టే ధోరణికి చరమగీతం పాడి, పేదలకు అండగా నిలవాలని ఆదేశించారు.ఎస్సీ, ఎస్టీల సమస్యల పై మూడవ త్రైమాసిక జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని శనివారం తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు.ఈ డి.వి.యం.సి సమావేశానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులు హాజరైయ్యారు.తిరుపతి జిల్లా నిఘా , పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ప్రవేశపెట్టిన అంశాల పై శాఖల వారీగా సమీక్షించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్లు.., జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యల పట్ల అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, స్వయంగా తనిఖీ చేసి తక్షణమే పరిష్కారాన్ని చూపాలని సూచించారు.అదే సమయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని వారు ఆదేశించారు.ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ... ప్రధానంగా దీర్ఘకాలిక సమస్యకు తక్షణమే పరిష్కార మార్గాలను చూపడంతో పాటు,.. అధికారులు తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించి, పేదలకు అండగా ఉండాలన్నారు. జిల్లా యంత్రాంగం అంకిత భావంతో పని చేసి, ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ప్రవేశపెట్టి సమీక్షించిన ప్రతి అంశానికి త్వరితగతిన పరిష్కార మార్గాలను చూపాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ద్వారా ఎస్/ఎస్టీ లబ్ధిదారుల గృహాల మంజూరు పై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి సొంతింటి కలను సాకారం చేయాలని హౌసింగ్ డిపార్ట్మెంట్ వారి నీ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఆయా శాఖల సమాధానాలను పరిశీలించిన అనంతరం, జాప్యం జరిగిన అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులు త్వరితంగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు.డీవీఎంసీ లో ప్రస్తావించే ప్రతి అంశానికి అధికారులు పరిష్కారం చూపాల్సిన భాధ్యత ఉందని, సివిల్ రైట్స్ డే ప్రతి నెలా జరిపి ఎస్సీ/ఎస్టీ సమస్యలకు పరిష్కారం చూపాలను చెప్పారు.ఎస్సీ, ఎస్టీ వర్గాల ఇళ్లకు సంబంధించి పట్టాలు మంజూరు, భూ సమస్యలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనం నిర్మాణం వంటి సమస్యలపై కమిటీ సభ్యులు విన్నవించుకోగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయింపు విషయంలో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ల ప్రత్యేక గ్రీవెన్స్ త్వరలో కలెక్టరేట్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గత సమావేశంలో కమిటీ సభ్యులు గుర్తింపు కార్డుల కోసం ఎన్నవించుకోగా ఈ సమావేశంలో వారికి గుర్తింపు కార్డులను జిల్లా కలెక్టర్ అందజేశారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు గృహాలు మంజూరు సంబంధించిన స్థలాన్ని గుర్తించడం, మంజూరు చేయడం వంటి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి గృహాలను మంజూరు చేయాలని హౌసింగ్ డిపార్ట్మెంట్ వారి నీ ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ..జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీల సమస్యల పై పరిష్కార దిశగా కృషి చేయాలి అని తెలిపారు. ఎస్సీ ఎస్టీల అట్రాసిటీ తదితర కేసులను జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సీరియస్ గా తీసుకొని పరిష్కరించేలా చూడాలని తెలిపారు. జిల్లాలోని మండల స్థాయి, జిల్లా స్థాయిలో లాండ్ ఆర్డర్ పాటిస్తూ కేసుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని శాఖవారిని ఆదేశించారు. కమిటీ సభ్యులు అట్రా సిటీ కేసులకు సంబంధించి ఎస్పి గారికి విన్నవించుకోక వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి సంబంధిత బాధితులకు న్యాయం చేస్తానని తెలిపారు. సత్యవేడు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సత్యవేడు నియోజకవర్గం లోని పలు ఎస్సీ, ఎస్టీ లకు సంబంధించిన సమస్యలపై వివరిస్తూ.. త్వరితగతన సమస్యల పరిష్కారానికి సంబంధిత డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి అధికారులు దృష్టి పెట్టాలని తెలిపారు.సూళ్లూరుపేట ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ చెందిన భూములు, ఇళ్ల పట్టాలు వంటి సమస్యలపై వివరిస్తూ అందరికీ న్యాయం జరిగేలా పరిష్కారం చూపాలని తెలిపారు.ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కు సంబంధించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం కోసం స్థల సేకరణ కు పనులను పూర్తి చేయాలని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద గృహాల రు విషయాలలో గృహ నిర్మాణ శాఖ వారు అర్హతను పట్టి మంజూరు చేయాలని తెలిపారు.సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ కమిటీ సభ్యుల దగ్గర నుంచి ఆర్జీలను స్వీకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీలు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓ లు రామ్మోహన్ , భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికార అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, డీవీఎంసి సభ్యులు, జిల్లా అధికారులు, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుడు ప్యాక్స్ డైరెక్టర్ బిజెపిలో చేరిక




**నేటి సాక్షి - కథలాపూర్ ( రాధారపు నర్సయ్య ) :** కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు నాంపెల్లి శ్రీధర్ కు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి కండువా కప్పి బీజేపి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల అధ్యక్షులు మల్యాల మారుతి,జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వర్రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొడిపెల్లి గోపాల్ రెడ్డి,సీనియర్ నాయకులు బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, పిడుగు ఆనంద్ రెడ్డి,కాసోజీ ప్రతాప్,తెడ్డు మహేష్,వొడ్డాటి సునీల్, భూమేష్,గంగాధర్ పాల్గొన్నారు.

# వంద రూపాయలు లతో సభ్యత్వం కార్యకర్త కు భరోసా

వంద రూపాయలు లతో సభ్యత్వ%శీ% కార్యకర్త కు భరోసా

ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తకి 5 లక్షలు ప్రమాద భీమా

5 లక్షలు ప్రమాద భీమా పత్రం కుటుంబ సభ్యులకు అందజేత

అందజేస్తున్న బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ



**నేటి సాక్షి ,బాపట్ల జిల్లా,(బాపట్ల టౌన్) :** తెలుగుదేశం పార్టీ ప్రమాద భీమా రూ.100/- లతో సభ్యత్వ నమోదు చేసుకుని ప్రమాదవశాత్తు బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కోమట్ల దుర్గా రెడ్డి మరణించగా వారికి తెలుగుదేశం పార్టీ రూ.5 లక్షలు ప్రమాద భీమా పత్రం కోమట్ల దుర్గా రెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన ఘన చరిత్ర మన తెలుగుదేశం పార్టీది అని అన్నారు.తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగం పసుపు సైన్యం సంక్షేమం కోసం వందల కోట్లు వెచ్చించిన తెలుగుదేశం పార్టీ వంద రూపాయలతో టిడిపి సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించిందని అన్నారు. కార్యకర్తలు వారి కుటుంబ సభ్యుల సంక్షేమం చూసే ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీపతానిపతాన్నారు.ఈ కార్యక్రమం ఆయన వెంట నక్కల వెంకట స్వామి,టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

# హోంగార్డుతో గొడవ వల్ల అజ్ఞాతంలోకి...

**36 ఏళ్లుగా ఇంటి ముఖం చూడని కాశీరాం**

**ఉద్యమంలోనే అశువులు బాసిన సహచరి!**

**ఎట్టకేలకు మహరాష్ట్ర పోలీసుల ఎదుట లొంగుబాటు**



**నేటిసాక్షి, రాయికల్ :** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగరావుపేట గ్రామానికి చెందిన బత్తుల కాశీరాం అలీయాస్ ప్రతాప్ అలీయాస్ సమర్ మహరాష్ట్ర గోండియా జిల్లాలో పోలీసుల ఎదుట సహచర మవోయిస్టులతో కలిసి లొంగిపోయారు. 36 ఏళ్లక్రితం గ్రామంలో హోంగార్డుతో జరిగిన గొడవ వల్ల పోలీసులు ఇంటికి రావడంతో కేసు నమోదు అవుతుందనే భయంతో భార్య మల్లవ్వతో సహ అడవి బాట పట్టిన కాశీరాం ఉద్యమానికి సెలవు ప్రకటించారు. దళసభ్యుడి నుండి డివిసిఎంగా ఎదిగి పని చేస్తున్నారు. గ్రామానికి చెందిన బత్తుల పెద్దరాజయ్య, గంగవ్వ దంపతులకు నలుగురు సంతానం కాగ పెద్దవాడైన కాశీరాం పెండ్లై ఇరువురు కుమారులు ఉండగా వారిని బంధువులకు అప్పగించి ఉద్యమ బాట పట్టడం అప్పట్లో సంచలనమైంది. అడవి బాట పట్టిన కాశీరాం ఇప్పటివరకు ఇంటి ముఖం చూడలేదని కుటుంబసభ్యులు చెప్పారు. భార్యభర్తల లొంగుబాటు కోసం పోలీసులు, బంధువులు ఎంత ప్రయత్నించిన సఫలం కాలేదు. అపరేషన్ కాగర్తో ఉద్యమం అంతిమ దశకు చేరుకున్న నేపథ్యంలో కాశీరాం తన సహచర దళసభ్యులతో ఈనెల 28న మహరాష్ట్రలో లొంగిపోయారు. గతంలోనే కాశీరాం భార్య ఆనారోగ్యంతో మృతి చెందారు. కాశీరాం లొంగిపోయినట్లు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో పలువురు కుటుంబసభ్యులు మహరాష్ట్రకు తరలివెళ్లారు. చాలా కాలం తర్వాత కాశీరాంను చూసిన కుటుంభీకులు, బంధువులు చెమ్మగిల్లిన కళ్లతో ఆనందం వ్యక్తం చేసారు.

# ఎస్టీ కాలనీలో ప్రజలకు అందరికి పౌర హక్కుల కల్పిస్తాం

**ఆర్డీవో గ్లోరియా**



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా, ( కర్లపాలెం) :** ఎస్టీ కాలనీలో ఉన్న ప్రజలకు పౌర హక్కుల కల్పించి వారికీ ఆధార్ కార్డు నమోదు చెయ్యాలి అని ఆర్డీవో గ్లోరియా అన్నారు.కర్లపాలెం మండలం నర్రావారిపాలెం ఎస్టీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కుల మత వర్గ వర్ణ పరంగా మనుషుల మధ్య వివక్ష ఉండరాదని, అందరూ కూడా ఉన్న అవకాశాలు ఉపయోగించుకొనిచదువుకుని సమాజంలో ఉన్నత స్థానం లో ఉండాలని, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు ఇంకా ఎవరికయినా లేనట్లయితే ధరఖాస్తు చేసుకోవలసినదిగా ఆర్డీవో గ్లోరియా చెప్పారు.ఎస్సీ ఎస్టీలు అన్యాయానికి గురి అయితే చట్టాలు ఉపయోగించుకొని రక్షణ పొందాలని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షాకీర్ పాషా, ఎంపిడిఓ అద్దూరి శ్రీనివాసరావు , సీఐ హరికృష్ణ, ఎస్ ఐ శివకుమార్ , సోషల్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన...

**రాష్ట్ర సహకార కార్పోరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి..**



**నేటి సాక్షి ప్రతినిధి, రుద్రంగి : ( కోక్కుల వంశీ ) :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం ఉమ్మడి మానాల, దేగవత్ తండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ కుటుంబాన్ని రాష్ట్ర సహకార కార్పోరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పరామర్శించారు. దేగవత్ తాండకు చెందిన దేగవత్ తిరుపతి తండ్రి మాజీ ఉప సర్పంచ్ పరశురాం నాయక్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శనివారం తిరుపతి ఇంటికి వెళ్లిన రాష్ట్ర సహకార కార్పోరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ముల రవీందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు జుల దిలీప్, జక్కుల లక్ష్మీ నర్సయ్య, జక్కు మోహన్, జక్కు వంశీ, అంబర్ సింగ్ నాయక్, జక్కు చిన్న లింగారెడ్డి, గంగాధర్ నాయక్, బంకట్ లాల్ నాయక్, గురుదాస్ నాయక్ తండా వాసులు ఉన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
14
ఆదివారం
30 నవంబర్ 2025

# చివరి భూములకు నీరందించడం లక్ష్యం

- కాలువల ఆధునికరణకు ముందస్తు ప్రతిపాదనలు
- 70 పనులకు రూ.6.50 కోట్లతో అంచనాలు
- అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం
- నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ చక్రపాణి



**నేటి సాక్షి,బాపట్ల జిల్లా (పర్చూరు) :** నాగార్జునసాగర్ ప్రాజెక్టు చివరి భూములకు సాగునీరు అందించి రైతులకు భరోసానివ్వాలన్న లక్ష్యంతో కాలువల ఆధునికరణకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ చక్రపాణి, డీఈ స్వామినాయక్ వెల్లడించారు. శనివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంప్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, నీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్న సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబాలకు అండగా ఉంటామని ఆయన అన్నారు.

### "ప్రతి చేనుకూ నీరుఅదే మా లక్ష్యం":చక్రపాణి

రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా నీటి సరఫరా కొనసాగేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి చేనుకు నీరు అందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. కాలువల నిర్వహణ, నీటి పారుదల వ్యవస్థ బలోపేతానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామని వివరించారు.

### రూ.6.50 కోట్లతో 70 పనులకు ప్రతిపాదనలు

### యన్ యస్ పి డీఈ స్వామి నాయక్

జంగిల్ క్లియరెన్స్, కట్టల పునరుద్ధరణ, కాలువల మ-రమ్మత్తులు వంటి 70 పనులకు రూ.6.50 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి నివేదికలు పంపించినట్లు తెలిపారు. నీటి సంఘాల నాయకులు సూచించిన మరిన్ని పనులను కూడా ప్రతిపాదనల్లో చేర్చుతామని చెప్పారు. వేసవికాలంలో పనులు ప్రారంభించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు.

### "2014-19లో అడుగడుగునా అభివృద్ధి 2019-24లో నిర్లక్ష్యం"

### పర్చూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు

2014-19 మధ్య ఎమ్మెల్యే ఏలూరి కృషితో నాగార్జునసాగర్ కాలువలన్నీపునరుద్ధరించబడ్డాయని గుర్తుచేశారు. 2019%-%24 వైసీపీ ప్రభుత్వ కాలంలో కాలువలపై ఎలాంటి శ్రద్ధ చూపకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వస్తూనే నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టినట్లు వివరించారు. మొంథా తుఫాన్ వల్ల ఏర్పడిన గండ్లను తాత్కాలికంగా పూడ్చిన తర్వాత, ఇప్పుడు కోనంకి సబ్‌డివిజన్‌లోని నాలుగు సెక్షన్లకు సంబంధించిన పూర్తి స్థాయి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మార్టూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాటినాగేశ్వరరావు, కమిటీ చైర్మను ఆంజనేయస్వామి, బండ్ల శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, కోసరాజు దిలీప్,కొల్లా మురళీకృష్ణ, మువ్వ ఆంజనేయులు, మహబూబ్ ఖాన్ తోపాటు నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

# కుందేరు వాగు ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

### డాక్టర్ వి.వినోద్ కుమార్



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా, (చీరాల) :** నీటి ప్రవాహ తగ్గిన తర్వాత కుందేరు వాగు డ్రైనేజీ పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం రాత్రి చీరాల - బాపట్ల మధ్య లో ఉన్న కుందేరు వాగును చీరాల ఆర్డీఓ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. తదుపరి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులతో మాట్లాడుతు కుందేరు వాగులలో నీటి ప్రవాహం తగ్గిన తర్వాత డ్రైనేజి నిర్మాణాల చేపట్టాలని మురుగునీటి (జలవనరుల)శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాల వల్ల ఎక్కువ నీరు రావడంతో నీరు సంక్రాంగా వెళ్ళాక పోవడంతో గట్టు తెగిపోవడం వల్ల నీరు పొలాలలోకి వెళ్లడంతో రైతులు నష్టపోవడం జరుగుతుందని తెలిపారు, నీటి ప్రవాహం తగ్గిన వెంటనే డ్రైన్ పనులు చేపట్టాలని సంభందిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట చీరాల ఆర్డీఓ,చంద్రశేఖర్ నాయుడు,తహశీల్దార్ గోపి కృష్ణ, జలవనరుల శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

# బాపట్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో..

### విధులు నిర్వహించే క్లాస్ -4 ఉద్యోగి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపిన జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్



**నేటి సాక్షి,బాపట్ల జిల్లా ప్రతినిధి :** జాన్ కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ అన్నివిధాలుగా అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ గారు తెలిపారు. బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో క్లాస్-4 వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న టి. జాన్ (55 సంవత్సరాలు) 2025 నవంబర్ 28న గుండెపోటుతో మరణించారు. జిల్లా ఎస్పీ ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. టి. జాన్ గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమని పేర్కొంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మరణించిన టి. జాన్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందనే భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుండి రావలసిన బెనిఫిట్స్ సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. టి. జాన్ భౌతిక ఖాయాన్ని శనివారం గుంటూరు పట్టణంలోని బాజ్జి నగర్‌లో ఆయన గృహం వద్ద ఉంచారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడ్మిన్ ఆర్.ఐ. మౌలుద్దీన్ ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, అత్యవసర ఆర్థిక సహాయంగా లక్ష రూపాయల నగదును జాన్ భార్య అంజమ్మకు అందజేశారు.

# ప్రజావాణి కార్యక్రమం రద్దు

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**నేటి సాక్షి కొమరం భీమ్ అసిఫాబాద్ ప్రతినిధి నవంబర్ 29 :**2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు- 2025 దృష్ట్యా ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి నిర్వహించు వివరాలను పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుందని, ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



# నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి



- ఎన్నికలపై పటిష్ఠ నిఘా
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నేటిసాక్షి, నల్లగొండ :** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికలలో ఏ చిన్న నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. శనివారం నల్లగొండ మండలంలోని దండం పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొదటి విడత నామినేషన్ల స్వీకరణకు శనివారం చివరి గడువు అయినందున 5 గంటల లోపు నామినేషన్ కేంద్రంలోకి వచ్చిన వారికి అనుమతి ఇవ్వాలన్నారు. ఐదు గంటల తర్వాత ఎలాంటి నామినేషన్లను అనుమతించవద్దని, నామినేషన్ల సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వారి వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తిప్పర్తి మండలంలో తిప్పర్తి మామిడాల, పజ్జూరు గ్రామ పంచాయతీలలో మొదటి విడత నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో బ్యాంకుఖాతా, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించని పక్షంలో నామినేషన్ల పరిశీలన సమయం వరకు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి సూచించారు.

# దిత్వా'తో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించండి

- అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి ఎవ్వరు బయటకు రావద్దు
- లోతట్టు ప్రాంత ప్రజలను ముదంగాఅప్రమత్తం చేయాలి
- సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలి
- చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :**శ్రీలంక నుంచి చెన్నై మీదుగా దూసుకు వస్తున్న దిత్వా తుపానుతో ప్రజలు అమత్తమంగా వ్యవహరించాలని, అత్యవసరమైతే తప్ప ఎవ్వరు ఇంటి నుంచి బయటకు రావద్దని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచించారు. తిరుపతి నగరంతోపాటు చుట్టు ప్రక్కల మండలాల్లో దిత్వా తుఫాను ప్రభావం అధికంగా ఉంటుందని వాతావారణ శాఖ అధికారులు హెచ్చరించినందున ఆయా మండలాల ప్రజలు అప్రమత్తం గా వుండాలని, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో నవంబర్ 29, 30, డిసెంబర్ 1వ తేదీ వరకు ఈదుర గాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున చంద్రగిరి నియోజకవర్గ ప్రజలందరు అత్యవసరమైతే తప్ప ఎవ్వరు ప్రయాణాలు చేయవద్దని, పంట పొలాల వద్దకు రాదని, విద్యుత్తు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మూడు రోజుల పాటు కురిసే వర్షాలతో జలాశయాలు, వంకలు, నదులు వద్దకు యువకులు, పిల్లలు వెళ్లకుండా వారి తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల వారీగా సర్పంచ్‌లు బాధ్యత తీసుకుని ప్రజలను అప్రమత్తం చేయాలని, సర్పంచ్‌లకు అండగా పార్టీ నాయకులు, కార్యకర్తలు చేదోడుగా నిలబడి దిత్వా తుఫాను బారి నుంచి పల్లెల్లో ప్రజలు, పశువులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలో వున్నా, లేకున్నా ప్రజల్లో ఉండాలన్న జగనన్న ఆశయానికి అనుగుణంగా అందరూ సహాయక చర్యలు చేపట్టాలని, ఎక్కడ ఏ అవసరం వున్నా తనకు సమాచారం అందిస్తే తనవంతు సాయం చేయడానికి సిద్ధంగా ఉంటానన్నారు. ఇలాంటి విపత్తులు వచ్చినపుడు పంచాయతీ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, యువజన విభాగం, విద్యార్థి విభాగాలకు చెందిన యువత బాధ్యత తీసుకుని సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు.



# విద్యార్థుల ప్రతిభకు తార్కాణం సైన్స్ ఫెయిర్

**నేటి సాక్షి (జిన్నారం) :** బొల్లారం మున్సిపాలిటీ శ్రీ వాగ్దేవి హై స్కూల్ లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమం సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించేందుకు సైన్స్ ఫైయిర్ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉదయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. శ్రీ వాగ్దేవి హై స్కూల్ లో విద్యార్థులు అనేక విభాగాల్లో తయారు చేసిన వివిధ రకాల నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్లోరియస్ పాఠశాల నిర్వాహకులు జి. సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో ఇలాంటి వైజ్ఞానిక విషయాలు తెలుసుకుని వాటిని గురించి వివరించడం అభినందించదగ్గ విషయం అని అన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత వెలికితీయడం సైన్స్ ఫెయిర్ ఉద్దేశం అని ఆయన తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను వారి వారి తల్లిదండ్రులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నారులతో ఏర్పాటు చేసిన అంగడి విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. కృష్ణ కిషోర్, ఇంఛార్జి గిరిజ, ఉపాధ్యాయుల బృందం దత్తాత్రేయ, శైలజ, చందనా కుమారి, అనూష, రాజ్యలక్ష్మి, గిరిజ, రాణి, అనూష, ఫూల్ కుమారి, సహాయకులు లావణ్య, రూప తదితరులు పాల్గొన్నారు.



నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం
30 నవంబర్ 2025


# జైన్ పరిశ్రమను ప్రారంభించి తంగడంచ భూములు అభివృద్ధి చేయాలి

- **జైన్ పరిశ్రమను ప్రారంభించి తంగడంచ భూములు అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి గారికి వినతిపత్రం అందించిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం రమేష్ బాబు..**

**నేటి సాక్షి 29 అమరావతి :**జుపాడు బంగ్లా మండలం తంగడంచ ఫారం 1600 ఎకరాల ప్రభుత్వ భూములను అభివృద్ధి చేయాలని, మీ చేతుల మీదుగా ప్రారంభించిన జైన్ పరిశ్రమ, మెగాసిడ్ పార్కును అభివృద్ధి చేయాలని ఇక నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ శనివారం టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు వినతి పత్రం అందించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి తంగడంచ ఫారం భూములను నమ్ముకుని దాదాపు 12 గ్రామాల ప్రజలు ఉపాధి కోసం యువత ఎదురు చూస్తున్నారని గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మీరు మెగాసిడ్ పార్క్,జైన్ పరిశ్రమను ప్రారంభించారని అయితే అభివృద్ధికి నోచుకోక ఆ భూముల అడవిని తలపిస్తున్నాయని భూములు అభివృద్ధికై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కొనసాగించినప్పటికీ పట్టించుకునే పరిస్థితి లేదన్నారు.. ఈ భూములు అభివృద్ధి చేస్తే నందికొట్కూరు నియోజకవర్గం లో నిరుద్యోగ సమస్య పూర్తిగా తీరుతుందని ఆ వైపున కృషి చేయాలని వారు కోరారు.. గతంలో యువ గళం పాదయాత్రలో నారా లోకేష్ గారు జైన్ పరిశ్రమను సందర్శించి అధికారంలోకి వస్తే పరిశ్రమను ప్రారంభించి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని వారు అన్నారు.. తక్షణమే ఈ ప్రాంత ప్రజల అభిప్రాయం మేరకు ఈ భూముల అభివృద్ధికి నాంది పలికి నిరుద్యోగ యువతీ యువకులకు రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు వినతి పత్రం అందించారు..



# కమలాపూర్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా తోలి నామినేషన్

## అడ్వకెట్ వెంగళ విజయ్ నామినేషన్ దాఖలు

**నేటి సాక్షి కమలాపూర్ :** కమలాపూర్ గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ తొలి సర్పంచ్ అభ్యర్థిగా అడ్వకేట్ వెంగళ విజయ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతుడిగా యువకుడిగా ప్రజాసేవలో నిత్యం ఉంటున్నటువంటి తనకి ఈ స్థానిక ఎలక్షన్లలో సర్పంచ్ గా తనకి అవకాశం ఇవ్వాలని ఆయన కమలాపూర్ గ్రామ ప్రజలని కోరారు. అలాగే ప్రజా సమస్యలు తెలిసిన వ్యక్తిగా నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రతి సమస్య పరిష్కారం కోసం పనిచేస్తానని ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలను లబ్ధిదారులందరికీ అందే విధంగా చూస్తానని అన్నారు. తాను అడ్వకేట్ వృత్తిలో ఉండి చాలామంది ప్రజలకు స్వచ్ఛందంగా సేవ చేశానని తనకి సర్పంచ్ గా అవకాశం ఇస్తే కమలాపూర్ మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.అలాగే కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి ఒడితెల ప్రణవ్ బాబు ఆశీస్సులతో తాను పనిచేస్తానని,గతంలో వార్డు మెంబర్ గా కమలాపూర్ ప్రజలకు సేవలు అందించానని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వచ్చినటువంటి అన్ని పథకాలను లబ్ధిదారులందరికీ అందేలా చేస్తానని కావున కమలాపూర్ సర్పంచ్ గా అవకాశం ఇచ్చి అదేవిధంగా కమలాపూర్ గ్రామ ప్రజల ఆశీస్సులు ఉండాలని ఈ సందర్భంగా కమలాపూర్ గ్రామ ప్రజలని కోరారు. ఈ సందర్భంలో భాగంగా నామినేషన్ దాఖలు చేసే సమయంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి వెంగళ విజయ్ తో పాటుగా కాంగ్రెస్ నాయకులు డా,, మౌటం కుమారస్వామి,మాట్ల రమేష్,బాలసాని రమేష్,పుల్ల శ్రీనివాస్, ఆడెపు శ్రీకాంత్ మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,కమలాపూర్ గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే సాక్షిగా..అపుడే మొదలైన 'భర్త-పెత్తనం'.!?

- **పదవి భార్యది..ప్రచారం భర్తది.!**
- **మూల రాంపూర్ లో 'కానుగంటి.లాస్య రాజశేఖర్' సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నిక**

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ 'పంచాయతీ' ఎన్నికల్లో తాము బలపరిచిన స్థానంలో బోణి కొట్టింది. ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 'కానుగంటి లాస్య రాజశేఖర్' సర్పంచ్ గా ఏకగ్రీవ ఎన్నికయ్యారు.

## మగ మహారాజులదే రాజ్యం.!

ఈ పంచాయతీ ఎన్నికల్లో బిసిలకు 42% రిజర్వేషన్ లు కేటాయించాలని కొందరు కోర్టు మెట్లెక్కి విఫలమయ్యారు. కాగా..ఇదే క్రమంలో ఏళ్ల నుంచి మహిళలకు 33% రిజర్వేషన్ లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. దరిద్రమేంటంటే.. రిజర్వేషన్లంటే.. పదవి దక్కేవరకే..జస్ట్.. 'యూజ్ అండ్ త్రో'..ఇది కాదనలేని సత్యం.! ఈ నేపథ్యంలో.. ఏ ఎన్నికలైనా మహిళాలకు కేటాయించిన 'రిజర్వేషన్'లో గెలుపొందే వరకు 'ఆమె'ను ముందుంచి ప్రచారం చేసుకుంటారు. ఆ తర్వాతా అంతే.! మీటింగ్ లకు 'ఆమె'ను భర్తనో.. బ్రదర్ సో..తండ్రో..కొడుకులో.. తీసుకెళతారు 'నిశానికి'..రబ్బరు బొమ్మలా 'కుర్చీ'లో కూర్చోబెట్టి.. 'తెరవెనుక' రాజకీయమంతా..ఆమె చేయాల్సిన 'పరిపాలనంతా' ..మన 'మగమహారాజు'లదే.! కాదనగలరా.? సరిగ్గా ఇదే క్రమంలో ఇప్పుడు ఈ 'పంచాయతీ' ఎన్నికల్లోనూ ఇదే 'ఆనవాయితీ' కంటిన్యూ అయ్యింది.!




## ఇక్కడే 'సూపర్ ట్విస్ట్'.!

ఇబ్రహీంపట్నం మండలం మూల రాంపూర్ గ్రామంలో సర్పంచ్ పదవి 'ఏకగ్రీవమైంది'.! ఇందులో 'ట్విస్ట్' ఏంటంటే.. ఏకగ్రీవ సర్పంచ్ గా ఎన్నికైంది మహిళా అభ్యర్థి 'లాస్య'.! కానీ.. రిజర్వేషన్ దుర్వినియోగానికి పరాకాష్టగా ఆమె భర్త రాజశేఖర్ గెలుపొందినట్టు 'సోషల్మీడియా'లో వైరల్ చేసుకుంటున్నారు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు. అదికూడా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ 'రాజశేఖర్'ను వెంటబెట్టుకుని వెళుతున్న ఓ 'ఫోటో'ను వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. తమ పార్టీ అభ్యర్థి 'కానుగంటి.లాస్య రాజశేఖర్'ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మూల రాంపూర్ గ్రామ-స్తులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఎమ్మెల్యే మెసేజ్ ఒకటి మొబైల్ లలో తెగతిరిగేస్తున్న వైనంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అపుడే 'ఆమె'పై ..'అతగాడి' పెత్తనం మొదలైందా.? దానికి ఎమ్మెల్యేనే ప్రత్యక్ష సాక్షిగా ఉండడమా.? ఎలాగూ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది..మరి 'ఆ-మహిళా సర్పంచ్'ను వెంట తీసుకుని వెళ్లొచ్చుగా అంటూ కామెంట్లు వినిపిస్తున్నాయి.ఇదేనా.? సంజయ్ ఓ శాసనసభ్యుడై ఉండి ఆయన సమక్షంలోనే 'ఆమె'కు ఇంత 'అగౌరవం' లభిస్తే..రానున్న ఐదేళ్ల పదవీ కాలంలో 'ఆమె' రబ్బరు స్టాంపేనన్న చర్చలు జరుగు తున్నాయి..'పాపం.. లాస్య.! ఏ తోట కాడుందో.? వంటింట్లో ఉందో.!?

# బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై భగ్గుమన్న బీజేపీ

- **జీఓ ప్రతుల దహనం**
- **ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

**నేటి సాక్షి, కరీంనగర్:** బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 46 పై బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు అడిచర్ల రాజు ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, జీఓ 46 ప్రతులను దహనం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్, ఓబీసీ రాష్ట్ర నాయకుడు అడిచర్ల రాజు మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ చేసిన వాగ్దానాలన్నీ నీటి మూటలేనని స్పష్టంగా అర్థమైందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరిట కాంగ్రెస్ ఇన్నాళ్లు రాజకీయ డ్రామాలు చేసిందని, ఇప్పుడు జీఓ 46 జారీ చేసి మోసం చేసిందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రస్తుతం స్థానిక సంస్థల్లో బీసీలకు కేవలం 22 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం దారుణమని, దీంతో ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. జీవో 46 ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేకపోతే జరగబోయే ఎన్నికల్లో బీసీలు రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుజ్జ శ్రీనివాస్, బండ రమణారెడ్డి, ఎన్నం ప్రకాష్, నరహరి లక్ష్మారెడ్డి, గుంజేటి శివకుమార్, శానగొండ వాసు, నాంపల్లి శ్రీనివాస్, మాసం గణేష్, అవదుర్తి శ్రీనివాస్, తిరుపతి సుధాకర్ పటేల్, హరి ప్రసాద్ పటేల్, ఎడ్ల ప్రసన్న, రంగు సంపత్ గౌడ్, కట్ట రాజు, ఒడ్నాల కోటేశ్వర్, బోయిని శ్రీనివాస్, పైడి ప్రసాద్, పర్వతం మల్లేశం, బత్తిని మహేష్, అజయ్, నారాయణ, తిరుమల్ రెడ్డి, కచ్చకాయల రాజేంద్రప్రసాద్, గుంటుక శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎయిడ్స్ వ్యాధితో అకాల మరణం పొందిన వారికి ఘన నివాళులు




**నేటి సాక్షి,బాపట్ల జిల్లా ప్రతినిధి :** హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధితో అకాల మరణం చెందిన ప్రతి ఒక్కరికి ఆత్మ శాంతించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారికి నివాళులు అర్పించవలసిన ఆవశ్యకత ఉందని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే విజయమ్మ పేర్కొన్నారు. డిసెంబర్ 1 అంతర్జాతీయ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని శనివారం బాపట్ల పట్నంలో స్వచ్ఛంద సంస్థలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పిఎస్ కె నర్సింగ్ కాలేజీ విద్యార్థిని కొవ్వొత్తుల జాగరణ కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్య కార్యాలయం నుండి బాపట్ల పాత బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగినది.తెలిసో తెలియకో ఆవేశంలోనూ హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి సోకిన మరణించిన వారి ఆత్మకు చేకూర్చాలని మనందరం మనస్సాక్షితో వారికి నివాళులర్పించడం మన ధర్మం అని, హెచ్ఐవి ఎయిడ్స్ తో పేర్కొన్నారు.మరణించిన కుటుంబాలకు మనం మైనోదారి కలిగించి వారికి అన్ని విధాలుగా అండగా ఉండాలని వారికి ప్రభుత్వ పథకాలు చేరువే విధంగా చూడాలని హెచ్ఐవి ఎయిడ్స్ తల్లిదండ్రులను కోల్పోయిన బాలలకు ఆశ్రయం కల్పించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి. ఐ ఓ రత్న మన్మోహన్, డాక్టర్ లలిత రాజేశ్వరి, డాక్టర్ బాల సుధా, డాక్టర్ మౌనిక, దిశా క్లినికల్ సర్వీసెస్ ఆఫీసర్ ఎం చైతన్య కుమార్, క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ పి కిరణ్ కుమార్, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీబీ సాగర్ బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియాసమావేశం



**నేటి సాక్షి కొమురం భీం ఆసిఫాబాద్ :** ఈరోజు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం లో ప్రసాద్ అన్న క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చునర్కర్ వసంత్ రావు మాట్లాడుతూ నిన్న జరిగిన కేరమేరి మండల సమావేశంలో నూతన డీసీసీ అధ్యక్షులు శ్రీమతి సుగుణ గారి అధ్యక్షతన ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ . శ్యామ్ నాయక్, మా నాయకులు శ్రీ కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు గారి పై, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ గౌడ్ గారి పై మరియు జైనూర్ AMC చైర్మన్ శ్రీ కుడిమేత విశ్వ నాథ్ గారి పై అనుచిత వాక్యాలు చేయడం సరికాదని శ్యామ్ నాయక్ కు హెచ్చరిక జారీ చేశారు 2023 ఎమ్మెల్యే ఆశవహుల అభ్యర్థుల గొంతు కోసియడం అని అనుచిత వాక్యలు చేయడం సరికాదు, ఆశావహుల గొంతు కోసింది నివ్వే. శ్యామ్ నాయక్ మీరు ఆసిఫాబాద్ లో MLA అవుతాని ఆశపడుతున్నావేమో కానీ నిన్ను ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రజలు 2023లోనే తిరస్కరించారు, నువ్వు ని జిందగీలో MLA కాలేవు. నువ్వు ఆసిఫాబాద్ జిల్లా ప్రజలని %=నూ% జిల్లా అధికారిగా ఉన్నపుడు ప్రజలని ఎంత ఇబ్బంది పెట్టినావో అందరికి తెలుసు, ఇంకోసారి మా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు అని శ్యామ్ నాయక్ ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు జై కాంగ్రెస్ జై కేవీపీరావు ఆసిఫాబాద్ జిల్లా సోషల్ మీడియా

# కాగజ్నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా అహ్మద్ పాషా.



**నేటి సాక్షి కాగజ్నగర్ టౌన్ నవంబర్ 29 :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ (రిజిస్ట్రేషన్ నంబర్ 259. యొక్క) అధ్యక్షునిగా శనివారం రోజు పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో అహ్మద్ పాషాను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని రిజిస్ట్రేషన్ ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు వడ్నాల. వెంకన్న ప్రధాన కార్యదర్శి ఈర్ల సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న అధ్యక్షుడు రతన్ కుమార్ పై ఆరోపణలు ఉన్నాయని, కమిటీ సభ్యులను సంప్రదించకుండానే ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతో ప్రెస్ క్లబ్ ఉనికికే ప్రమాదం అని భావించి కనీసం కమిటీ సభ్యులను కూడా గౌరవించకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని. కమిటీ సభ్యులు ఫిర్యాదు చేయడంతో గౌరవాధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శి సమావేశం ఏర్పాటు చేసి ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు వారు తెలిపినారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అహ్మద్ పాషా మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం కృషి చేస్తానని మీడియా మిత్రులతో, కమిటీ సభ్యులతో సంప్రదించి ఏ నిర్ణయం అయినా అందరి సమ్మతితో తీసుకొని, జర్నలిస్టులకు ఏ సమస్య ఎదురైన, ప్రభుత్వం నుండి జర్నలిస్టులకు రావలసిన అన్ని సదుపాయాలపై తన వంతు శాయశక్తుల కృషి చేస్తానని, సంఘాలకు, గ్రూపులకు అతీతంగా అందరిని కలుపుకుంటూ.ముందుకు సాగుతా అని ఈ అవకాశం ఇచ్చిన గౌరవ అధ్యక్షులు, ప్రధానకార్యదర్శి, మరియు కమిటీ సభ్యులకు తోటి మీడియా మిత్రులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.